RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 20 జనవరి 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:193

## పెట్టుబడుల ఆకర్షణకు సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన

ప్రపంచ ఆర్థిక వేదిక (WEF) వార్షిక సమావేశాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతినిధి బృందం స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటనకు బయలుదేరుతున్నారు. సోమవారం ఉదయం మేడారం లో పునర్నిర్మించిన సమ్మక్క సారలమ్మ గద్దెలకు పూజలు చేసి.. మహా జాతరను సీఎం ప్రారంభిస్తారు. ఉదయం 8 గంటలకు అక్కడినుంచి హెలికాప్టర్ లో బయల్దేరి హైదరాబాద్ చేరుకుంటారు. ఉదయం 9.30 కు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ముఖ్యమంత్రి దావోస్ కు బయల్దేరుతారు. ముఖ్యమంత్రి వెంట సీఎంఓ అధికారులు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఈ పర్యటన కు వెళుతున్నారు.జనవరి 20 నుంచి నాలుగు రోజులపాటు దావోస్ లో జరిగే సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ కంపెనీల సీఈఓలు, అంతర్జాతీయ స్థాయి పెట్టుబడిదారులు, వివిధ రంగాల ప్రతినిధులతో విస్తృత స్థాయి భేటీలు నిర్వహించనున్నారు.దావోస్‌లో తెలంగాణ పెవిలియన్ వేదికగా గూగుల్, సేల్స్‌ఫోర్స్, యూనిలీవర్, హనీవెల్, ఎల్‌ఓరియల్, నోవార్టిస్, టాటా గ్రూప్, డీపి వరల్డ్, ఇన్ఫోసిస్, సిస్కో వంటి ప్రముఖ సంస్థల అధినేతలతో సీఎం విడివిడిగా భేటీ అవుతారు. పలు రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొంటారు.తెలంగాణలో పెట్టుబడులు, పరిశ్రమల విస్తరణ, ఐటీ, ఏఐ, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాల్లో పెట్టుబడులపై ప్రధానంగా చర్చలు జరుపుతారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 ను, రాష్ట్రం లో వివిధ రంగాల అభివృద్ధి కి ఉన్న అనుకూలతలను దావోస్ వేదికగా ప్రపంచానికి చాటి చెప్పాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ పర్యటన ద్వారా తెలంగాణను ప్రపంచ పెట్టుబడి గమ్యస్థానంగా మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది.

## 98 వేల ఎకరాల అదనపు ఆయకట్టు సాధనకు ప్రణాళికలు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



వార్తా 2 లో

## తెలంగాణలో పురపోరుకు సర్వం సిద్ధం

### – ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించే యోచనలో ఎలక్షన్ కమిషన్

### – 7 నగరపాలక సంస్థలు, 116 పురపాలికల ఎన్నికల షెడ్యూల్ జారీకి సిద్ధం

రాష్ట్రంలో పురపోరుకు సర్వం సిద్ధమైంది. 7 నగర పాలక సంస్థలు, 116 పురపాలికల ఎన్నికల షెడ్యూల్ జారీకి ఈసీ సమాయత్తం అవుతోంది. ఒకటి, రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదలకు సిద్ధమైన ఈసీ, ఈ ఎన్నికలను ఒకే విడతలో నిర్వహించే యోచనలో ఉంది. మున్సిపల్ ఎన్నికలకు మార్గదర్శకాలు జారీ చేసింది.రాష్ట్ర మంత్రివర్గం ఆమోదంతో మున్సిపల్ పోరుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమాయత్తమైంది. ఒకటి, రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన దస్త్రం ఇవాళ ఎన్నికల సంఘానికి చేరనుంది. అందుకు అనుగుణంగా ఈసీ సమావేశమై షెడ్యూల్ విడుదల చేస్తుంది. ఇప్పటికే మహబూబ్‌నగర్, కరీంనగర్, మంచిర్యాల, కొత్తగూడెం, రామగుండం, నల్గొండ, నిజామాబాద్ నగరపాలక సంస్థలతో పాటు 116 పురపాలికల్లో ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు సిద్ధమయ్యాయి. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తవగా, వాటిపై గెజిట్లు జారీ అయ్యాయి.రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలకు ఒకే దఫాలో ఎన్నికలు జరపాలని ఈసీ భావిస్తోంది. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత 15 రోజుల్లో పోలింగ్ జరగనుంది. పోలింగ్ పూర్తైన తర్వాత రెండ్రోజులకు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగి ఎన్నికలకు ఆటంకం కలిగితే మరుసటి రోజు రీపోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. ఆ తర్వాత రోజు అధికారులు ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటిస్తారు. ఆ తర్వాత మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఎన్నికైన కార్పొరేటర్లతో మేయర్, డిప్యూటీ మేయర్, వార్డు కౌన్సిలర్లతో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికలు జరిపి ఫలితాలను ప్రకటిస్తారు.స్వతంత్ర అభ్యర్థిని స్థానికంగా పది మంది ఓటర్లు ప్రతిపాదించాలని తెలిపింది. ఒక అభ్యర్థి 4 కంటే ఎక్కువ నామినేషన్లు వేయకూడదని స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వ్ చేసిన స్థానాల్లో పోటీ చేసే ఆయా వర్గాల వారు డిప్యూటీ తహసీల్దార్ హోదాకు తగ్గని అధికారి సమక్షంలో చేసిన డిక్లరేషన్‌ను విధిగా జత చేయాలని మార్గదర్శకాల్లో ఈసీ సూచించింది.

### మున్సిపల్ ఎన్నికలకు ఇన్‌చార్జ్‌ల నియామకం

### మున్సిపల్ ఎన్నికలకు ఇన్‌చార్జ్‌లు.. భువనగిరికి సీతక్క... ఖమ్మంకు సురేఖ

హైదరాబాద్ జనవరి 19 : మున్సిపల్ ఎన్నికలకు ఇన్‌చార్జ్‌లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియమించారు. పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. 1. ఆదిలాబాద్ – సుదర్శన్ రెడ్డి 2. నిజామాబాద్ – ఉత్తమ్‌కుమార్ రెడ్డి 3. మల్కాజ్‌గిరి – కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 4. చేవెళ్ల – శ్రీధర్‌బాబు 5. మెదక్ – వివేక్ 6. కరీంనగర్ – తుమ్మల నాగేశ్వరరావు 7. పెద్దపల్లి – జూపల్లి కృష్ణారావు 8. నల్గొండ – అడ్లూరి లక్ష్మణ్ 9. భువనగిరి – సీతక్క 10. వరంగల్ – పొంగులేటి 11. మహబూబ్‌నగర్ – పొన్నం ప్రభాకర్ 12. మహబూబ్‌నగర్ – దామోదర రాజనర్సింహా 13. జహీరాబాద్ – అజహరుద్దీన్ 14. నాగర్‌కర్నూల్ – వాకిటి శ్రీహరి 15. ఖమ్మం – కొండా సురేఖ

## బిజెపి కొత్త జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా ఏకగ్రీవం



న్యూఢిల్లీ జనవరి 19 భారతీయ జనతా పార్టీ(బిజెపి)కి కొత్త సారథి వచ్చారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడు జెపి నడ్డా పదవీకాలం ముగియడంతో ఈ ఎన్నిక జరిగింది. మంగళవారం ఉదయం 11 గంటలకు నితిన్ పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తారు. బిహార్‌కు చెందిన నితిన్ నబీన్(46)ను గతేడాది డిసెంబర్‌లో బిజెపి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తూ.. పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన్ను పార్టీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు అప్పుడే వార్తలు వచ్చాయి. కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. గతేడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపుర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా నితిన్ గెలిచారు. బిహార్ నుంచి పార్టీలో ఆ స్థాయికి చేరిన తొలి నేతగా ఆయన గుర్తింపు పొందారు.

## మేడారంలో పైలాన్ ఆవిష్కరించి, గద్దెలను పునః ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి



వరంగల్/ప్రజాబలం ప్రతినిధి: జనవరి 19 ములుగు జిల్లాలోని మేడారంలో నూతనంగా పునర్నిర్మించిన సమ్మక్క–సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని, పలు అభివృద్ధి పనులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం అట్టహాసంగా ప్రారంభించారు. రూ. 251 కోట్లతో మేడారంలో అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టగా.. చివరి దశకు పనులు చేరుకున్నాయి.మేడారం మహాజాతర (జనవరి 28–31) ముంగిట, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. సోమవారం తెల్లవారుజామున 6.30 గంటల సమయంలో సమ్మక్క–సారలమ్మ గద్దెల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పైలాన్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం తన కుటుంబ సభ్యులతో కలిసి వనదేవతలను దర్శించుకుని, గద్దెలపై నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.సాధారణంగా ఎవరైనా ముఖ్యమంత్రిగానీ, నేతలు, భక్తులు ఎవరైనా మేడారంను దర్శించుకున్న సమయంలో నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కానీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మనవడు రేయాన్ష్‌తో కలిసి తులాభారంలో పాల్గొన్నారు. రేవంత్ ఒక్కరే త్రాసులో కూర్చుని తన బరువు అంత బంగారాన్ని సమర్పించడానికి బదులుగా మనవడితో కలిసి తులాభారం వేయడం హాట్ టాపిక్ అవుతోంది.రాతి శిల్పకళ: సుమారు రూ. 101 కోట్లతో గద్దెల ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. 4 వేల టన్నుల గ్రానైట్ రాతిపై ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించేలా 7 వేల చిత్రాలను చెక్కించారు. కేవలం 100 రోజుల వ్యవధిలోనే ఈ పునర్నిర్మాణ పనులను పూర్తి చేసి భక్తులకు అంకితం చేయడం ఒక రికార్డుగా నిలిచింది.మౌలిక వసతులు: జంపన్న వాగులో భక్తుల స్నానాలకు వీలుగా పారిశుధ్య పనులు, ఘాట్‌ల అభివృద్ధి, రవాణా సౌకర్యాలను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. జంపన్న వాగులో శాశ్వతంగా నీరు ఉండేలా రామప్ప, లక్నవరం చెరువుల నుండి నీటిని మళ్లించే ఏర్పాట్లు చేశారు.జనవరి 18 (ఆదివారం) రాత్రి మేడారంలోని హరిత హోటల్‌లో సీఎం అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ భేటీ జరిగింది. రాష్ట్ర చరిత్రలో సచివాలయం వెలుపల ఒక జిల్లాలో క్యాబినెట్ భేటీ నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ, మేడారం జాతరను కుంభమేళా తరహాలో నిర్వహించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

## కవితకు సపోర్ట్ గా పీకే

హైదరాబాద్, జనవరి 19 కొత్త పార్టీ ఏర్పాటు దిశగా కవిత అడుగులు బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చాక, తన రాజకీయ భవిష్యత్తుపై కల్వకుంట్ల కవిత పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రయత్నాలను ఆమె ముమ్మరం చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, కార్యాచరణ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) ఆమెకు సహాయం అందిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో తీవ్రమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది.

రెండు నెలల వ్యవధిలో ప్రశాంత్ కిశోర్ రెండుసార్లు హైదరాబాద్ వచ్చి కవితతో రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా కూడా వీరి మధ్య భేటీ జరిగినట్లు తెలుస్తోంది. కొత్త పార్టీని ప్రకటిస్తే రాజకీయ పరిస్థితులు ఎలా ఉంటాయి, పార్టీని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, అనుసరించాల్సిన వ్యూహాలు వంటి కీలక అంశాలపై వీరిద్దరి మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ సమావేశాలపై కవిత గానీ, తెలంగాణ జాగృతి ప్రతినిధులు గానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.మరోవైపు తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకే కొత్త పార్టీ అవసరమని కవిత బలంగా వాదిస్తున్నారు. తన సారథ్యంలోని 'తెలంగాణ జాగృతి'ని రాజకీయ శక్తిగా మార్చి, 2029 ఎన్నికల్లో ప్రజల పక్షాన పోటీ చేస్తామని ఆమె ఇప్పటికే స్పష్టం చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పార్టీ విధివిధానాల రూపకల్పనకు దాదాపు 50 కమిటీలతో అధ్యయనం చేయిస్తున్నారు. అదే సమయంలో మైనార్టీలు, బీసీలు, యువత తనతో కలిసి రావాలని, తన 'తెలంగాణ సెక్యులర్ పార్టీ'కి మద్దతివ్వాలని పిలుపునిస్తున్నారు.గతంలో ఏపీలో వైఎస్ జగన్‌కు, 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్‌కు, వ్యూహకర్తగా పనిచేశారు. తమిళనాడులో నటుడు విజయ్ పార్టీకి కూడా సేవలు అందిస్తున్నారు.

ఇప్పుడు కవితతో జతకట్టడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు కవిత క్షేత్రస్థాయి సన్నాహాలు, మరోవైపు పీకే వ్యూహాత్మక మార్గదర్శకత్వంతో త్వరలోనే కొత్త పార్టీ ప్రకటన ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ కొత్త రాజకీయ ప్రయోగం తెలంగాణలో ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి

## ప్రభుత్వానికి భయపడుతున్న స్పీకర్

హైదరాబాద్ భారతీయ జనతా పార్టీ తరుపున బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి వేసిన పిటిషన్ కు ఫిబ్రవరి 06 తేది లోపు వివరణ ఇవ్వాలని సుప్రీం కోర్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ కు నోటీసులు జారీ చేసింది. రాజ్యంగాని పరిరక్షించాల్సిన స్పీకర్ ప్రభుత్వానికి భయపడి నిర్ణయం తీసుకోపోకపోవడం రాజ్యాంగానికి తూట్లు పొడిచినట్లే నని మహేశ్వర్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతపట్టుకుని దేశం మొత్తం తిరుగుతున్నారు మరి తెలంగాణలో రాజ్యాంగాన్ని కాపాడాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. దీనిపై రాహుల్ గాంధీ కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం.

ప్రజాబలం

20 జనవరి 2026 మంగళవారం

# హిందూ పండుగలూ కలుషితం!

తెలుగు నేలపై ఆధ్యాత్మికత పేరుతో ఒక వింతైన ధోరణి కొనసాగుతోంది. దశాబ్దాలుగా సాగుతున్న మత మార్పిళ్లు ఇప్పుడు సరికొత్త వేషధారణను అద్దుకున్నాయి. ఒకప్పుడు నిశ్శబ్దంగా సాగే ఈ ప్రక్రియ, ఇప్పుడు అచ్చంగా హిందూ ధర్మంలోని ఆచారాలను కాపీ చేస్తూ సాగుతుండటం తీవ్ర చర్చకు దారితీస్తోంది. అటు క్రైస్తవం తన మూలాలను వదులుకుంటోందా, లేక ఇటు హిందూ సంప్రదాయాలను తనలో కలిపేసుకుని భ్రమకు గురి చేస్తోందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మత ప్రచారం కోసం హిందూ ధర్మ మూలాలను వాడుకోవడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది.సాధారణంగా ఏ మతానికైనా కొన్ని ప్రత్యేక గుర్తులు, ఆచారాలు ఉంటాయి. కానీ ప్రస్తుతం క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో అభిషేకాలు చేయడం, కుంకుమలు దిద్దడం, వ్రతాలు నిర్వహించడం వంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. అంతటితో ఆగక, అయ్యప్ప స్వామి మాల లాగా ప్రత్యేక దీక్షలు పట్టడం, సంక్రాంతి పండుగ వేళ ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి హరిదాసుల వేషధారణతో వేడుకలు జరపడం వంటివి సాధారణమయ్యాయి. ఇది ఆయా మతాల సిద్ధాంతాలకు పూర్తిగా విరుద్ధమైనప్పటికీ, ప్రజలను ఆకర్షించడానికి ఇదొక వ్యూహంగా మారుతుండటం ఆందోళనకరం. బలవంతపు మత మార్పిళ్లు ఒక ఎత్తు అయితే, ఇటువంటి సంకరణం ద్వారా సామాన్య ప్రజలను గందరగోళానికి గురి చేయడం మరో ఎత్తు. ఎవరి మతాన్ని వారు ఇష్టపూర్వకగా అనుసరించడం రాజ్యాంగం కల్పించిన హక్కు. కానీ, ఒక మతంలోని గుర్తులను మరో మతం అరువు తెచ్చుకుని, తమ ఉనికిని కప్పిపుచ్చుకుంటూ మార్పిడిలను ప్రోత్సహించడం అనైతికమే. ఇది కేవలం ఆధ్యాత్మిక అంశం మాత్రమే కాదు, భవిష్యత్తులో సామాజిక అస్థిరతకు, సాంస్కృతిక విధ్వంసానికి దారితీసే ప్రమాదం ఉంది. ఓ రకంగా ఇది హిందూత్వంపై జరుగుతున్న దాడే అనుకోవచ్చు.ప్రజల నమ్మకాలను గౌరవించడం అంటే వారి మూలాలను చెరిపివేయడం కాదు. మతం మారిన వ్యక్తి తన పాత సంప్రదాయాలను వదులుకోలేకపోతే అది మానసిక స్థితిని ప్రతిబింబిస్తుంది, కానీ వ్యవస్థాకృతంగా పాస్టర్లు ఇలాంటి ప్రయోగాలు చేయడం వెనుక పెద్ద కుట్ర ఉందన్న విమర్శలు వస్తున్నాయి. మేడ్చల్ జిల్లాలోని నాగారంలో ఉన్న జ్యోతి డీ అడిక్షన్ రిహాబిలిటేషన్ సెంటర్ ను పరిశీలిస్తే.. ఇక్కడ చుట్టూ జనావాసాలు, మధ్యలో ఓ బూత్ బంగ్లాలాంటి భవనం.. చుట్టూ వ్యాకటర్స్.. ఈ భవనంలో ఏం జరుగుతుందో.. ఎవరికీ తెలిసే అవకాశం లేదు. కానీ ఇక్కడ సుమారు 40 మందికి పైగా మద్యానికి బానిసలైన వారికి చికిత్స జరుగుతోంది. చికిత్స అనేకంటే.. అక్రమ నిర్బంధం అని చెప్పాలి. మద్యానికి బానిసైన వ్యక్తిని అమాంతం నిర్బంధించి తీసుకువెళ్లడం ఇల్లీగల్ డీ అడిక్షన్ రీహాబిలిటేషన్ సెంటర్లలో ఒక పార్టు మాత్రమే. దీని కోసం ఆవారా.. గూండా గ్యాంగ్ లను ఉపయోగిస్తారు. చికిత్సలు అందించాలంటే వైద్య నిపుణులు, సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులను నియమించాలి. ఒకరిద్దర్ని పెట్టుకొని మిగితా వారిని అర్హతలే లేకున్నా నడిపిస్తున్నారు. బాధితుల నుంచి ఒక్కో సెషన్ రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు.మద్యానికి బానిసైన వినాయక్ నగర్ కు చెందిన కృష్ణ (52)ను రెండు నెలల జ్యోతి డీ అడిక్షన్ సెంటర్ లో చికిత్స కోసం చేర్పిస్తే.. అందులో వంట మనిషి కయ్యూం ఆదివారం కృష్ణ పై విచక్షణారహితంగా దాడి చేసి చంపేయడం కలకలం రేపింది. తాగుడు మాన్పించే ఈ కేంద్రంలో వంట మనిషి కయ్యూం మద్యం తాగి వచ్చి ఆ మత్తులో చికిత్స పొందుతున్న బాధితులను కొడుతుంటారని వారు వాపోతున్నారు. బాధిత కుటుంబాల నుంచి రూ. లక్షల్లో ఫీజు వసూలు చేసి చిత్రహింసలకు గురి చేయడం.. ఇలాంటి కేంద్రాలు ఏఏ ప్రాంతాల్లో ఎన్ని ఉన్నాయో.. వైద్య ఆరోగ్యశాఖ వద్ద సమాచారం లేకపోవడం గమనార్హం.ఆల్కహాల్, మత్తుకు బానిసలైన వారి వల్ల వారికే కాదు.. కుటుంబానికి.. సమాజానికి కూడా నష్టం జరుగుతోంది. అసాంఘిక శక్తులుగా మారే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకే ఇలాంటి వారిని మత్తు నుంచి బయటకు తీసుకువచ్చేందుకు.. డీ అడిక్షన్ రీహాబిలిటేషన్ సెంటర్లలో వీరికి ట్రీట్మెంట్ చేస్తారు. అయితే మత్తుకు బానిసైన వారిని ఒక్కసారిగా ఆ అలవాటు నుంచి దూరం చేస్తే.. మానసిక సమస్యలకు దారి తీస్తుంది. కాళ్లు, చేతులు, వణుకుతుండడం.. ప్రేలాపనలు.. పిచ్చిగా ప్రవర్తించడం వంటివి చేస్తుంటారు. వీరికి తొలుత డీటాక్సిఫికేషన్ చికిత్స అందించాలి. యాంటి క్రేవింగ్ మందులు అందిస్తూ.. కౌన్సిలింగ్, మోటివేషన్ థెరపీ అందించాలి.డీ అడిక్షన్ రీహాబిలిటేషన్ కేంద్రాల్లో చికిత్స పేరుతో బలవంతంగా మత మార్పిడిలకు పాల్పడుతున్నారని జ్యోతి సెంటర్ లో చికిత్స పొందుతున్న బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు ఓ మతానికి చెందిన గ్రంథం చదవాలని, ఆ మతానికి చెందిన పాటలు పాడాలని తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని వాపోతున్నారు. ఒకవేళ డైలీ గ్రంథం, పాటలు పాడని వారి పై అకారణంగా దాడులు చేస్తుంటారని, భోజనం కూడా పెట్టరని వారు పేర్కొంటున్నారుఆధ్యాత్మికత అనేది ఆత్మకు శాంతిని ఇవ్వాలి కానీ, ఇలాంటి వింత పోకడలతో సమాజంలో విభజన తీసుకురాకూడదు. ఇప్పటికైనా మేధావులు, మత పెద్దలు దీనిపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. అసలైన భక్తికి, ఆకర్షించే ప్రలోభాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించకపోతే మన సంస్కృతి మసకబారే ప్రమాదం ఉంది.

# 98 వేల ఎకరాల అదనపు ఆయకట్టు సాధనకు ప్రణాళికలు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**ప్రజా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి 74 వేల 163 కోట్ల రూపాయలు ఖర్చు చేశాం**

**పేదల సంక్షేమానికి 47 వేల 710 కోట్లు**

**ఖర్చుచింతకాని మండలం వందనం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం**





**ఖమ్మం ప్రతినిధి జనవరి 19 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లాలో ల 98 వేల ఎకరాల అదనపు ఆయకట్టు సాధనకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క సోమవారం చింతకాని మండలం వందనం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్ లతో కలిసి శంకుస్థాపన చేశారు 2500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు 35 కోట్ల 75 లక్షలతో చేపట్టిన కొదుమూరు వందనం ఎత్తిపోతల రెండవ విడత పనులకు, వందనం గ్రామంలో ఎస్సి కాలనీలో కోటి 85 లక్షలతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్ల పనులకు, ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి వందనం పుట్టకోట జెడ్పీ రోడ్డు వరకు 3 కోట్ల 50 లక్షలతో చేపట్టనున్న బీ.టి రోడ్డు నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ కొదుమూరు - వందనం లిఫ్ట్ పనులు గతంలో పూర్తి చేసి 2500 ఎకరాలకు 2013 ప్రాంతంలో సాగు నీరు అందించామని అన్నారు చింతకాని మండలం చుట్టు నాగార్జున సాగర్ నీళ్ళు ఉన్నప్పటికి కొదుమూరు, వందనం రైతులు సాగు నీరు అందక ఇబ్బందులు పడ్డారని, వీరి ఆవేదన పరిశీలించి 2009 లో ఇచ్చిన మాట ప్రకారం అప్పట్లో మొదటి విడత లిఫ్ట్ పూర్తి చేశామని అన్నారు కొదుమూరు వందనం లిఫ్ట్ కారణంగా ఎండాకాలంలో కూడా నీరు అందుబాటులో ఉంటుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరో 2,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు కొదుమూరు వందనం లిఫ్ట్ రెండవ ఫేజ్ కు శ్రీకారం చుట్టామని అన్నారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట గత పాలకులు పేద ప్రజలను మోసం చేశారని, ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు నిర్వహించిన పాద యాత్రలో ప్రతి గ్రామంలో ప్రజలు ఇండ్ల కోసం తాపత్రయం పడటం గమనించి అధికారంలోకి రాగానే 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను 22 వేల 500 కోట్ల రూపాయలతో మంజూరు చేసామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని, ప్రతి వారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపులు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. జిల్లాలో 2 లక్షల 79 వేల ఎకరాల ఆయకట్టు ఉమ్మడి రాష్ట్రంలో కల్పించామని అన్నారు ప్రజా ప్రభుత్వం నేడు మరో ల 98 వేల ఎకరాల అదనపు ఆయకట్టు సాధించేందుకు ప్రణాళికలు తయారు చేశామని అన్నారు. మున్నేరు పాలేరు లింకు కెనాల్ ద్వారా ల 38 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, జవహర్ లిఫ్ట్ క్రింద 33 వేల 25 ఎకరాలు, రాజీవ్ ఫీడర్ కెనాల్ ద్వారా 23 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, కొదుమూరు వందనం లిఫ్ట్ ద్వారా 2500 ఎకరాలు, మంచుకొండ లిఫ్ట్ ద్వారా 2412 ఎకరాల ఆయకట్టుకు నీళ్ళు అందించే పనులు చేపట్టామని అన్నారు నేడు రైతులకు మేలు చేసేందుకు మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు, వ్యవసాయానికి 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్, సన్న వడ్లకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్, రైతు భరోసా, రైతు బీమా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగంపై గత 2 సంవత్సరాల కాలంలో ప్రజా ప్రభుత్వం 74 వేల 163 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసిందని అన్నారు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, చేయూత ఫించన్, వడ్డీ లేని రుణాలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, గృహ జ్యోతి, సన్న బియ్యం వంటి వివిధ సంక్షేమ పథకాలకు 47 వేల 710 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని అన్నారు. ప్రపంచంతో పోటీ పడేలా మన విద్యార్థులు చదువుకోవాలని 100 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు మంజూరు చేశామని, మధిర లో 25 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, రాబోయే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు మధిర అసెంబ్లీ 5 మండలాల పరిధిలో కట్టలేరు, మున్నేరు, వైరా నది జలాలు వృథాగా పోకుండా ఆనకట్టలు కట్టిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రజల స్థితిగతులు మెరుగవ్వాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో మహిళలకు 5 వేల కోట్ల రూపాయలు వడ్డి లేని రుణాలు ప్రభుత్వం అందజేస్తున్నదని అన్నారు మహిళలు ఆత్మగౌరవంతో ఉండే విధంగా ఇందిరమ్మ చీరలను ప్రత్యేకంగా డిజైన్ చేయించి ఇంటింటికీ పంపిణీ చేశామని అన్నారు. 96 లక్షల కుటుంబాలకు రేషన్ షాపుల ద్వారా ప్రతి సభ్యుడికి ఉచితంగా నెలకు 6 కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకు ఎటువంటి రాబందులు, గద్దలు ప్రజా సొమ్ము కాజేయకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు తెలిపారు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 35 కోట్ల వ్యయంతో కొదుమూరు- వందనం ఎత్తిపోతల రెండవ విడత పనులకు నేడు శంకుస్థాపన చేసుకున్నామని, ఈ ప్రాజెక్టు పూర్తి చేయడం వల్ల 2500 ఎకరాల ఆయకట్టుకు అదనంగా సాగునీరు అందుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టును అతి తక్కువ కరెంటు ఖర్చుతో గ్రావిటీ ద్వారా అధికంగా పొలాలకు సాగునీరు అందేలా డిజైన్ చేశామని, ఈ ప్రాజెక్టు కొదుమూరు గ్రామ రైతులకు బాగా ఉపయోగపడుతుందని అన్నారు కొదుమూరు వందనం ఎత్తిపోతల పథకం రెండవ విడత పనులు త్వరగా పూర్తయ్యే విధంగా ఇరిగేషన్ అధికారులు మానిటరింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు సంక్షేమంలో భాగంగా పెద్ద ఎత్తున ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ డబ్బులు రైతుల ఖాతాలో జమ చేస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్త కళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఇరిగేషన్ ఈఎన్సి రమేష్, ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఏఎంసి చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, సిపిఓ ఏ శ్రీనివాస్, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి నవీన్ బాబు, జిల్లా మైనారిటీ అధికారి ముజాహిద్, వందనం సర్పంచ్ ఆవుల నాగేశ్వర రావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్లకు వేలం

**తొర్రూర్, బహదూర్ పల్లి, కుర్మల్ గుడ ల్లోని 137 ప్లాట్లు**

**మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ**

**ఫిబ్రవరి 7-8 తేదీల్లో బహిరంగ వేలం**

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ , జనవరి 19 నగరంలోని వివిధ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న 137 ఓపెన్ ప్లాట్లను (జూశ్రీశీం) బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లా తొర్రూర్ , కుర్మల్ గుడ, మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలోని బహదూర్ పల్లి ప్రాంతాల్లో ఇప్పటికే అభివృద్ధి చెంది మౌలిక వసతులతో ఉన్న ప్లాట్లకు ఫిబ్రవరి 7, 8 తేదీల్లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ శ్రీ వి.పి.గౌతం తెలిపారు. ఆయా ప్రాంతాలను బట్టి బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరల్లోనే చదరపు గజానికి రూ. 20 వేల నుంచి 30 వేల వరకు అప్ సెట్ ప్రైస్ తో ఈ ప్లాట్లు (జూశ్రీశీం) అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తమ ఆకాంక్షలు, అభిరుచులకు అనుగుణంగా సొంత స్థలంలో ఇంటిని నిర్మించుకోవాలనుకుంటున్న వారికి ఈ ప్లాట్లు చాలా అనుకూలంగా ఉంటాయని ఎం.డి శ్రీ వి. పి. గౌతం తెలిపారు. మంచి కనెక్టివిటీతో ఎటువంటి వివాదాలు లేని క్లియర్ టైటిల్, ప్రభుత్వ యంత్రాంగమే ఈ లేవుట్లను అభివృద్ధి చేయడం, కొనుగోలు చేసిన వెంటనే భవన నిర్మాణాలను చేపట్టేందుకు వీలుగా ఉన్న ఈ ప్లాట్లకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ ప్రాంతాల్లోని ప్లాట్ల కొనుగోలుకు గతంలో పెద్ద ఎత్తున స్పందన రావడంతో మరోసారి ప్లాట్లను వేలం ద్వారా విక్రయిస్తున్నామని ఆయన తెలిపారు. వీటి కొనుగోలుపై ఆసక్తి ఉన్నవారు నిర్ణీత ధరావతును (జువీణ) మీ-సేవా కేంద్రాల్లో ఆన్ లైన్ /యుపి ఐ ద్వారా చెల్లించవచ్చని, అలాగే డిడి ద్వారా కూడా చెల్లించవచ్చన్నారు. ఓఆర్ఆర్-ఆదిభట్ల, ఐటి క్యారిడార్ కు సమీపంలోని తొర్రూర్ లే అవుట్ లోని ప్లాట్లకు ఫిబ్రవరి 7, 8 వ తేదీ న, ఓఆర్ ఆర్ సమీపంలోని బహదూర్ పల్లి, శంషాబాద్ ఎయిర్ పోర్టు కు దగ్గర్లో ఉన్న కుర్మల్ గుడ ప్రాంతాల్లోని ప్లాట్లకు ఫిబ్రవరి 8 వ తేదీ మధ్యాహ్నం బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు www.swagruha.telangana.gov.in వెబ్ సైట్ లో చూడవచ్చని వివరించారు. పోన్ నెంబర్లు 8121022230 (తొర్రూర్), 8347472106 (బహదూర్ పల్లి),7993455802 (కుర్మల్ గుడ)లలో సంప్రదించవచ్చు.అందుబాటులో ని ప్లాట్లుతొర్రూర్ - 105 ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. చదరపు గజానికి కనీస ధర (అప్ సెట్ ప్రైస్) రూ. 25 వేలు కాగా ఇవి 200-500 చదరపు గజాల విస్తీర్ణం లో ఉన్నాయి. బహదూర్ పల్లి - 12 ప్లాట్లు ఉన్నాయి. 200-1000 చ.గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ లేవుట్ లోని కార్నర్ ప్లాట్ కు చదరపు గజానికి కనీస ధర రూ.30 వేలుగాను, ఇతర ప్లాట్లకు రూ. 27 వేలుగాను నిర్ధారించారు. కుర్మల్ గుడ - 20 ప్లాట్లు 200-300 చ.గజాల విస్తీర్ణంలో ఉండగా చదరపు గజానికి రూ.20 వేలు కనీస ధరగా నిర్ధారించి బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నారు.దరఖాస్తుకు ఆఖరు తేదీలు తొర్రూర్ ప్రాంతంలోని ప్లాట్ల కొనుగోలుకు ఆసక్తి చూపే వారు రూ. 2 లక్షల ధరావతుతో ఫిబ్రవరి 6 తేదీ లోగా, బహదూర్ పల్లిలోని ప్లాట్లకు రూ. 3 లక్షలు, కుర్మల్ గుడ లోని ప్లాట్లకు రూ.2 లక్షల ధరావతుతో ఫిబ్రవరి 7 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

## ప్రజలకు అందుబాటులో పోలీస్ శాఖ

## జిల్లా ఎస్పీ డి. జానకి,

మహబూబ్నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి. జానకి పాల్గొని ప్రజల నుండి పిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలు, భూ వివాదాలు, కుటుంబ వివాదాలు, పోలీసు సంబంధిత ఇబ్బందులను జిల్లా ఎస్పీ కి నేరుగా విన్నవించారు. ఎస్పీ ప్రతి ఫిర్యాదుదారునితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యలను పూర్తిగా అవగాహన చేసుకున్నారు. అనంతరం ఆయా పిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ఇన్స్పెక్టర్లకు తగిన ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ముఖ్యమైన కేసుల విషయంలో సంబంధిత ఎస్హెచ్ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎలాంటి పైరవీలు అవసరం లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని తెలిపారు. చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు.పోలీస్ వ్యవస్థ పూర్తిగా ప్రజల కోసమేనని, ఎవరి జోక్యం లేకుండా, భయభ్రాంతులు లేకుండా ప్రజలు తమ సమస్యలను వెల్లడించాలని కోరారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కారమై, ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# ప్రజలతో మమేకమై ప్రజాసేవ చేస్తాం

### అభివృద్ధి ధ్యేయంగా, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది

### రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద,రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి,జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 19 :** రాష్ట్రంలో ప్రజలతో మమేకమై ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర కార్మిక,ఉపాధిశిక్షణ,కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో చేపట్టిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణానికి రాష్ట్ర పర్యాటక,సాంస్క ృతిక శాఖ మంత్రి,జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ లతో కలిసి భూమి పూజ చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజలతో మమేకమై ప్రజా సేవ చేస్తున్నామని, ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తున్నామని తెలిపారు. చెన్నూర్ పట్టణంలో 47 కోట్ల 11 లక్షల రూపాయలతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను మంజూరు చేసి నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. వృత్తి విద్యా కోర్సులలో నైపుణ్య శిక్షణను అందించి యువతకు ఉపాధి కల్పించడం కొరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో 40 కోట్ల రూపాయలతో అంతర్గత రహదారులు,మురుగు కాలువల నిర్మాణం చేపట్టడం జరిగిందని, సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా అందని రేషన్ కార్డులను అర్హులకు అందించి ప్రజా పంపిణీ వ్యవస్థలో చౌక ధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ సోమనపల్లి ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టి కొనసాగుతున్నాయని తెలిపారు. విదేశీ విద్యను అభ్యసించే విద్యార్థులకు విదేశీ విద్యా పథకం ద్వారా 20 లక్షల రూపాయలను అందించి ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ ప్రాంత ప్రజల సంక్షేమం కోసం 100 పడకలతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరిగిందని, ఈ ప్రాంతంలోని కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ సెంటర్ ఏర్పాటుచేసి సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని 10 లక్షల రూపాయల పరిమితికి పెంచడంతో పాటు అర్హులైన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం జరుగుతుందని తెలిపారు.జైపూర్ పవర్ ప్లాంట్ ను విస్తరిస్తూ మరొక ప్లాంట్ నిర్మాణం చేపట్టడం జరిగిందని, తద్వారా ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు 9 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు అందించడం జరుగుతుందని, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు అన్ని రంగాలలో రాణించేందుకు ఆర్థిక చేయూత అందించి ప్రోత్సహించడం జరుగుతుందని, క్యాంటీన్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాములు తయారు చేయడం,ఇతర వ్యాపారాలను నిర్వహించే విధంగా తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు.చెన్నూర్ లో మహిళా సంఘాలకు పెట్రోల్ బంకు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఇసుక మాఫియా పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వ మన ఇసుక వాహనం ద్వారా తక్కువ ధరకు వినియోగదారులకు ఇసుకను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అమృత్ పథకం క్రింద చెన్నూర్ మున్సిపాలిటీ కి 30 కోట్ల రూపాయలు మంజూరు చేసి నీటి ట్యాంకులు,పైప్ లైన్ల నిర్మాణం చేపట్టి ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీటిని నిరంతరం అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని తెలిపారు. జిల్లా ఇన్చార్జి మంత్రి మాట్లాడుతూ...ఎంతో మంది తెలంగాణ ప్రజల ప్రాణబ్ త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రా(ష్టాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా దాదాపు 20 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేయడం జరిగిందని,రైతు భరోసా,రైతు భీమా పకడ్బందీగా అమలు చేయడం జరిగిందని తెలిపారు. చెన్నూర్ మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ప్రజల సంక్షేమం దిశగా కృషి చేస్తామని తెలిపారు.అర్హులైన పేదలకు రేషన్ కార్డులు అందించి సన్న బియ్యం ప్రతినెల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు.జిల్లా కలెక్టర్





మాట్లాడుతూ...చెన్నూరు పట్టణంలో ప్రభుత్వం చేపట్టిన అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ ద్వారా సమీప ప్రాంతాలలోని నిరుద్యోగ యువతకు అధునాతన సాంకేతిక నైపుణ్య శిక్షణ అందించి స్వయం ఉపాధి పొందేలా తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పనులను వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకునే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆదాయం చేకూరేలా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు.. మహిళల సంక్షేమంలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు ప్రయాణం,200 యూనిట్ల ఉచిత విద్యుత్,రేషన్ కార్డుల జారీ వంటి అనేక కార్యక్రమాలను జిల్లాలో అధికారుల సమన్వయంతో సమర్ధవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.అనంతరం చెన్నూర్ పరిధిలోని 214 స్వయం సహాయక సంఘాల సభ్యులకు 76 లక్షల 65 వేల 430 రూపాయల చెక్కును అందజేశారు. చెన్నూర్ పట్టణంలోని 16వ వార్డు కొత్తగూడెం కాలనీలో 50 లక్షల రూపాయల సి. ఎస్. ఆర్. నిధులతో ముదిరాజ్ భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది.8వ వార్డులో 1 కోటి 40 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి నిధులతో బైపాస్ సి సి రోడ్డు నిర్మాణం, 9వ వార్డులో 18 లక్షల 50 వేల రూపాయలతో సి సి రోడ్డు పనులు,15వ వార్డులో 20 లక్షల రూపాయల ఎస్ బి ఎం నిధులతో నూతన ఆస్పిరేషన్ టాయిలెట్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు న్యాయం చేయకపోతే మూడు పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తాం

### బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

### బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి

హైదరాబాద్ జనవరి 19 మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు న్యాయం చేయకపోతే మూడు పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తామని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. నిన్న మేడారంలో జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై కనీసం చర్చించలేదని, బీసీ రిజర్వేషన్లపై చర్చించకుండా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని క్యాబినెట్ నిర్వహించడం బీసీలను మరోసారి దగా చేయడ మేనని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా ఫైర్ అయ్యారు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈరోజు హైదరాబాదులోని లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు బీసీ జేఏసీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు . ఆందోళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను నమ్మించి మోసం చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క వైఖరి మారకపోతే భవిష్యత్తులో రాజకీయంగా భారీ మూల్యం చెల్లించక తప్పదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం మంత్రివర్గ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల పై ఎందుకు చర్చించలేదు చట్టపరంగా ఇవ్వలేనప్పుడు పార్టీ పరంగానైనా ఇస్తామని ఎందుకు ప్రకటించడం లేదు మున్సిపల్ ఎన్నికలలో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెపుతాం బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎన్నికలు జరపాలని బిజెపి, బిఆర్ ఎస్ పార్టీలు ఎందుకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం లేదు గ్రామపంచాయతీ ఎన్నికల తర్వాత 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఇక ఎన్నికలైనా నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు స్పష్టంగా హామీ ఇచ్చి ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని నిర్ణయించడం అంటే బీసీలను నమ్మించి తడి గుడ్డతో గొంతు కోసిందని ఆయన మండిపడ్డారు బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయవలసిన బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు, ఇందుకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాన్ని సమర్థించడం చాలా సిగ్గుచేటు అన్నారు అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు మద్దతిచ్చిన అఖిలపక్ష పార్టీలు ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తే ఏ రాజకీయ పార్టీ కూడా సడిచప్పుడు చేయకుండా మౌనం పాటిస్తున్నాయని, ఈ పార్టీలకు బీసీల పైన కపట ప్రేమ ఉందని మున్సిపల్ ఎన్నికల విషయంలో తేలిపోయింది అన్నారు మెస్సి ఆట కోసం హైదరాబాదుకు వచ్చిన రాహుల్ గాంధీ బీసీలకు ఇంత అన్యాయం జరుగుతున్న హైదరాబాద్ కు వచ్చి ఎందుకు స్పందించడం లేదన్నారు బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు బుట్ట దాఖలు చేస్తుంటే రాహుల్ గాంధీ కళ్ళుమూసు కుంటున్నాడా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు కుమ్మక్కై బీసీలకు ద్రోహం తలపెడుతున్నాయని బీసీ రిజర్వేషన్లు తగ్గడానికి స్థానిక ఎన్నికలు జరగడానికి ఈ రెండు పార్టీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ లే కారణమని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు చట్టపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం ఇవ్వలేకపోతే బీసీ సమాజానికి క్షమాపణ చెప్పి పార్టీ గుర్తులతో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీపరంగా జనాభా దామాషా ప్రకారం 56% టికెట్లు ఇస్తామని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు,

లేదంటే కాంగ్రెస్ ను బీసీలు ఇక జన్మలో నమ్మరని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఇక ముగిసిన అధ్యాయంగా మిగిలిపోతుందని ఆయన హెచ్చరించారు బీసీ రిజర్వేషన్ల 42 శాతం సాధించుకునే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని రెండు రోజుల్లోనే జేఏసీ సమావేశం నిర్వహించి భవిష్యత్తు ఉద్యమ కార్యక్రమం ప్రకటించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, అధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ జేఏసీ కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్,బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ, బీసీ జేఏసీ వైస్ చైర్మన్ దీటి మల్లయ్య, జజుల లింగం గౌడ్, బుదాని సదానందం,మాదేశి రాజేందర్, తారాకేశ్వరి, జిల్లెల నరసింహ, గూడూరు భాస్కర్, సంధ్యారాణి, సిద్ధాంతం శ్యామల, శైలజా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, విజయలక్ష్మి, రాజేశ్వరి,వెంకటేష్, శ్రీనివాసాచారి, గజ్జల సత్యం గౌడ్, జే. వెంకటయ్య,జే. వెంకటమ్మ, నర్సమ్మ, అంజమ్మ, బీవీ, అలవేల, తదితరులు పాల్గొన్నారు ..

## సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం వెనుక కుట్ర: మాజీ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్ జనవరి 19: రాష్ట్రంలో కొద్ది రోజులుగా సింగరేణి స్కాంలు, మంత్రుల మధ్య వాటాల పంచాయితీ చూస్తున్నామని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. సైట్ విజిట్ విధానంపై దేశ వ్యాప్తంగా అనేక ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అసలు సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం గతంలో లేదని, 2024లోనే సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానాన్ని తీసుకువచ్చారని తెలియజేశారు. నైనీ బ్లాక్ కాంట్రాక్ట్ రద్దు చేశామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చెబుతున్నారని, సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం వెనుక కుట్ర ఉందని విమర్శించారు. ప్రస్తుత నిబంధనలతో టెండర్ ఎవరు వేస్తున్నారో ముందే తెలిసిపోతుందని పేర్కొన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే నిజాయితీ ఉంటే దీనిపై విచారణ చేయించు అని సూచించారు.

# ఈరోస్ చైర్మన్ తో సీఎం చంద్రబాబు భేటి



అమరావతి దావోస్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈరోస్ ఇన్నోవేషన్ సంస్థ చైర్మన్ కిషోర్ లుల్లా, కో-ఫౌండర్, కో-ప్రెసిడెంట్ రిధిమా లుల్లా, కో-ప్రెసిడెంట్ స్వనీత్ సింగ్ లతో భేటీ అయ్యారు. దావోస్ మ్యాన్ అంటూ తన సహచరులకు ముఖ్యమంత్రిని కిషోర్ లుల్లా పరిచయం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జనరేటివ్ ఏఐ, డీప్ టెక్, డిజిటల్ కంటెంట్ ఎకానమీ రంగాల్లో ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించారు.84

# నిజాయతీకి దక్కిన విజయం..

### సీఎం చంద్రబాబు పై కేసు కొట్టివేత హర్షణీయం.

### ప్రజాస్వామ్యానికి ఇది శుభపరిణామం

### న్యాయవ్యవస్థ పై ప్రజలకు నమ్మకం పెరిగింది

.బద్వేలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై కేసు పెట్టివేత హర్షణీయమని డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది నిజాయితీకి దక్కిన విజయమన్నారు అంతే కాకుండా న్యాయ వ్యవస్థ పై ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు.చంద్రబాబు ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూసిన శక్తులకు ఈ తీర్పు ఒక చెంపపెట్టు అన్ని చెప్పారు.చంద్రబాబు నాయుడు దశాబ్దాల రాజకీయ జీవితం మచ్చలేనిదన్నారు.సీఎం నారా చంద్రబాబు నాయుడు పై రాజకీయ కక్షతో గత ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసును గౌరవ న్యాయస్థానం కొట్టివేయడం ప్రజాస్వామ్య విజయమని పేర్కొన్నారు.అలాగే కేవలం రాజకీయంగా దెబ్బతీయాలనే దురుద్దేశంతోనే గత ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేసి, అక్రమ కేసులతో వేధించింది. ఎన్ని కుట్రలు పన్నినా,ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా చివరికి సత్యమే జయించిందని తెలియజేశారు.ఈ తీర్పుతో చంద్రబాబు నాయకత్వం పై ప్రజల్లో ఉన్న నమ్మకం మరింత బలపడిందని,న్యాయస్థానాలు ఎప్పుడూ సత్యం పక్షానే ఉంటాయని ఈ ఘటనే నిరూపించిందని చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి అన్నారు

# వెలమల సిమ్మన్నకు లోక్నాయక్సాహిత్య పురస్కారం

విశాఖపట్నం ప్రముఖ రచయిత డాక్టర్ వెలమల సిమ్మన్నకు లోక్నాయక్ సాహిత్య పురస్కారం దక్కింది. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి లోక్ నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖలో ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ నేపథ్యంలో సిమ్మన్నకు రెండు లక్షల నగదు, ప్రశంసా పత్రం అందజేశారు. లోక్ నాయక్ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారాల కింద రూ.లక్ష చొప్పున నగదు, పురస్కారాలను తానా ప్రపంచ సాహిత్య వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ తోటకూర ప్రసాద్, సెంట్రల్ లండన్ డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉదరు అరేటి, హెన్రీ ఫోర్డ్ విశిష్ట వైద్య పురస్కార గ్రహీత డాక్టర్ వేములపల్లి రాఘవేంద్ర చౌదరి, ప్రపంచ ప్రఖ్యాత కేన్సర్ వ్యాధి నిపుణులు దత్తాత్రేయుడుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి ఏటా పురస్కారాలు అందించి, సత్కరించడం అభినందనీయమన్నారు. ఎన్టిఆర్, హరివంశరారు బచ్చన్ల వర్థంతి సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఇంగ్లిష్పై ఉన్న వ్యామోహంతో నేడు తెలుగు భాషను పక్కన పెట్టేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భాషలపై పట్టున్నవారు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. తెలుగు భాష విషయంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, మాజీ ఎంపి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చేస్తున్న కృషిని అభినందించారు. యార్లగడ్డ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు ఏపి డిప్యూటీ స్పీకర్ ఆర్ రఘురామకృష్ణరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్ రాజు, సినీనటి ప్రభ, రచయిత మేడా మస్తాన్ రెడ్డి పాల్గొన్నారు.

# జనసేన గూటికి సుచరిత

గుంటూరు, జనవరి 19, ఏపీలో రాజకీయాలు విచిత్రంగా మారుతున్నాయి.కూటమి అధికారంలోకి వచ్చి 19 నెలలు అవుతోంది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపడేందుకు చేయని ప్రయత్నం అంటూ లేదు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఆ పార్టీలో ఉన్న చాలామంది నేతలు కూటమి పార్టీల్లో చేరారు. అయితే ఇటీవల ఆ చేరికలు తగ్గుముఖం పట్టాయి. అయితే సంక్రాంతి తర్వాత చాలామంది వైసిపి నేతలు పార్టీకి గుడ్ బై చెబుతారని ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోని మహిళా నేతలకు ప్రాధాన్యత తగ్గినట్లు వార్తలు వస్తున్నాయి. అందుకే వారు పార్టీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు టాక్ నడుస్తోంది. ముఖ్యంగా గుంటూరు జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి పార్టీకి రాజీనామా చేస్తారని పొలిటికల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీఆవిర్భావం నుంచి జగన్ వెంట అడుగులు వేస్తున్న చాలామంది నేతలు ఉన్నారు. అటువంటి వారిలో గుంటూరు జిల్లాకు చెందిన మేకతోటి సుచరిత ఒకరు. దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆమెకు ఎంతగానో ప్రోత్సాహం అందించారు. జడ్పిటిసి సభ్యురాలిగా అవకాశం ఇచ్చారు. 2009లో ఆమె తొలిసారిగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతోనే అసెంబ్లీలో అడుగు పెట్టారు. అందుకే ఆయన అకాల మరణంతో కుమారుడు జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. అయితే ఉప ఎన్నికల్లో మరోసారి విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా రెండోసారి పోటీ చేసి ఓడిపోయారు. 2019లో మూడోసారి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచేసరికి జగన్మోహన్ రెడ్డి తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. 2024 ఎన్నికల్లో నాలుగో సారి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు మేకతోటి సుచరిత

కొంతకాలంగా పొలిటికల్ గా సైలెంట్ గా ఉన్నారు సుచరిత మొన్నటి ఎన్నికల్లో ప్రత్తిపాడు బదులు తాడికొండ నుంచి పోటీ చేశారు. అది ఎంత మాత్రం ఆమెకు అంగీకారం కాదు. ఎందుకంటే 2009 నుంచి ఆమె ప్రత్తిపాడు నుంచి పోటీ చేస్తూ వచ్చారు. 2019లో అదే నియోజకవర్గంలో నుంచి గెలిచేసరికి జగన్ మంత్రివర్గంలో హోం మంత్రి పదవి అందుకున్నారు. కానీ విస్తరణలో భాగంగా రెండునర ఏళ్ళకే మంత్రి పదవి పోగొట్టుకున్నారు. అయితే తనను మంత్రివర్గం నుంచి తొలగించడం పై అసంతృప్తికి గురయ్యారు. పార్టీకి దూరమవుతారని కూడా ప్రచారం నడిచింది. అయినా సరే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. కానీ జగన్మోహన్ రెడ్డి ఆమెను ప్రత్తిపాడు నుంచి తాడికొండ కు మార్చారు. అప్పట్లో కూడా ఆమె అసంతృప్తికి గురైనట్లు వార్తలు వచ్చాయి. అయితే గత 19 నెలల కాలంలో ఆమె యాక్టివ్ గా మారింది తక్కువ. అయితే వైసీపీలో ఉంటే తనకు రాజకీయ భవిష్యత్తు లేదని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. అందుకే జనసేనలో చేరేందుకు ఆమె సిద్ధపడుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. సంక్రాంతి తర్వాత ఆమె జనసేన లో చేరడం ఖాయమని టాక్ నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# టీడీపీలో ఏం జరుగుతోంది...

విజయవాడ, జనవరి 19, ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారు.

కానీ ఆయన శ్రమను ప్రజలు గుర్తిస్తున్నారు కానీ ఎమ్మెల్యేలు మాత్రం గుర్తించడం లేదు.ఎక్కువ మంది శాసనసభ్యులు తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారారు. ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటూ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ వారి వ్యవహార శైలిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు నిజంగా దోపిడీకి దిగుతున్నారన్న విమర్శలు సొంత పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తున్నాయి. గతంలో ప్రధాన మీడియా ద్వారా వచ్చే విమర్శలు.. ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా వస్తున్నాయి.ఇటీవల మంగళగిరి కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి అందిన నివేదిక మేరకు దాదాపు 48 మంది ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేదని, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదని స్పష్టం చేసింది. అయితే వారిని చంద్రబాబు హెచ్చరించినట్లుగా వార్తలు వచ్చినప్పటికీ ఎమ్మెల్యే పనితీరు మాత్రం గాడిన పడలేదన్నది వాస్తవం. ఎందుకంటే ప్రతి పనికీ పర్సంటేజీలు. ప్రతి కార్యక్రమంలో అవినీతి. సొంత పార్టీ నేతలను కూడా వారు వదలకుండా దోపిడీకి తెరతీస్తున్నారన్న విమర్శలున్నాయి. చంద్రబాబు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల, లోకేశ్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఎమ్మెల్యేలు కొందరు నిర్భీతిగా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం పార్టీలోనే జరుగుతుంది.తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్నిల మధ్య తలెత్తిన వివాదంలోనూ ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొలికపూడి శ్రీనివాసరావు ఎంపీపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. అయినా సరే ఆయనను పిలిచి మందలించిన సందర్భం లేదు. అలాగే అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్ ప్రసాద్ విషయంలో కానీ, ఉత్తరాంధ్ర జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేల పనితీరుపై అక్కడి కార్యకర్తలే నేరుగా ఆరోపణలు చేస్తున్నారు.

అయినా పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఎమ్మెల్యేల పనితీరుతో పార్టీ బాగా డ్యామేజీ అయింది. ఇక రానున్న కాలంలో ఇలాంటి మెతక వైఖరిని అవలంబిస్తే మాత్రం ఖచ్చితంగా వచ్చే ఎన్నికల్లో టీడీపీ కి నష్టం తప్పదన్న సంకేతాలు ఆ పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తున్నాయి.

# కోట్ల ఫ్యామిలీ దూరమేనా

కర్నూలు, జనవరి 19, టీడీపీ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి పార్టీ అధినాయకత్వంపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఆయన గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. పార్టీ అధినాయకత్వాన్ని కలిసే ప్రయత్నం కూడా కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి చేయడం లేదట. దీంతో డోన్ నియోజకవర్గంలో మాత్రమే కాదు కర్నూలు జిల్లాలో కోట్ల మౌనంపై అనేక ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. మాజీ ముఖ్యమంత్రి కుమారుడు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు వరకూ యాక్టివ్ గా తిరిగిన ఆయన ఎమ్మెల్యే అయిన తర్వాత మాత్రం పూర్తిగా నిరాశలో మునిగిపోయారు. కర్నూలు జిల్లాలో కోట్ల కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. అదే సమయంలో కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా ఒక వెలుగు వెలిగారు. ..2024 ఎన్నికలకు ముందు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి తన కుటుంబంతో కలసి టీడీపీలో చేరారు. తన తండ్రి సుదీర్ఘకాలం కొనసాగిన కాంగ్రెస్ పార్టీని వదిలేసి ఆయన టీడీపీ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర విభజనకు కారణమైన కాంగ్రెస్ కు రాష్ట్రంలో పుట్టగతులు లేవని భావించిన ఆయన ఆ నిర్ణయం తీసుకున్నారని అంటారు. వైసీపీలోకి వెళ్లడం ఇష్టంలేక టీడీపీలోకివచ్చారు. కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి రాకతో కర్నూలు జిల్లాలో టీడీపీకి అదనపు బలం చేకూరినట్లయింది. అయితే దే సమయంలో తనకు శత్రువుగా భావించే కేఈ కృష్ణమూర్తి కూడా రాజకీయంగా రిటైర్ అయ్యారు. కానీ కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మాత్రం ఎమ్మెల్యే సీటును అయిష్టంగానే తీసుకున్నారు. గెలిచిన తర్వాత మంత్రి పదవి వస్తుందని ఆశిస్తే, తన రాజకీయ అనుభవమంత వయస్సు లేని టీజీ భరత్, బీసీ జనార్థన్ రెడ్డి మంత్రి కావడం ఆయనను కుదురునివ్వకుండా చేస్తుందంటున్నారు.వచ్చే ఎన్నికల నాటికి తాను కూడా రాజకీయంగా వైదొలగాలని కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి నిర్ణయించుకున్నట్లు సమాచారం. అవసరమైతే తన సతీమణిని రాజకీయాల్లో కొనసాగించాలని, తాను మాత్రం రాజకీయాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు ఆయన సన్నిహితుల వద్ద పదే పదే ప్రస్తావిస్తున్నారట. తాను ఇక ఏ ఎన్నికల్లో పోటీ చేయబోనని కుటుంబంలోని ముఖ్యులతో పాటు సన్నిహితులకు కూడా కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి చెబుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం డోన్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నా అక్కడికే పరిమితమయిన కోట్ల ఇక రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదంటున్నారు. రాజకీయాలు ఇక తనకు పనికి రావని కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి సన్నిహితుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. మరి కోట్ల నిర్ణయం ఎలా ఉంటుందన్నది చూడాలి.

# పట్టు కొల్పోతున్నారా...

కడప, జనవరి 19, పులివెందుల అంటేనే ఒకప్పుడు వైఎస్ కుటుంబానికి అడ్డా అనే మాట రాజకీయాల్లో బలంగా వినిపించేది. వరుస విజయాలతో ఈ నియోజకవర్గం వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కి అత్యంత బలమైన కంచుకోటగా నిలిచింది. అయితే రాజకీయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. కాలం మారితే పరిస్థితులు కూడా మారతాయన్న మాట ఇప్పుడు పులివెందులలో స్పష్టంగా కనిపిస్తోంది. తాజాగా తెలుగుదేశం పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండటంతో ఇక్కడి రాజకీయ వాతావరణం పూర్తిగా మారుతున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.ఇటీవలి కాలంలో పులివెందుల నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు గణనీయంగా పెరిగాయి. ఒకప్పుడు జగన్‌తో కలిసి నడిచిన నాయకులే ఇప్పుడు పార్టీకి దూరమవుతున్నారు. గత జెడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలవడం ఈ మార్పులకు ఆరంభంగా మారింది. ఆ తర్వాత దశలవారీగా పలువురు ముఖ్య నేతలు టీడీపీ వైపు చూస్తున్నారు. బయటకు పెద్దగా హడావుడి లేకపోయినా, చాపకింద నీరు మాదిరిగా టీడీపీ ప్రభావం గ్రామగ్రామానికీ విస్తరిస్తోందనే అభిప్రాయం వినిపిస్తోంది.ప్రత్యామ్నాయంగా బలమైన పార్టీగా టీడీపీ మాత్రమే కనిపిస్తుండటం కూడా ఈ వలసలకు కారణమని చెబుతున్నారు. ఇతర పార్టీల ప్రభావం పెద్దగా లేకపోవడంతో అసంతృప్త నేతలు సూటిగా టీడీపీ గూటికే చేరుతున్నారు. ఈ క్రమంలో వేంపల్లి ప్రాంతానికి చెందిన వైసీపీ నేత, జగన్‌కు సన్నిహితుడిగా పేరున్న చంద్రశేఖర్ రెడ్డి టీడీపీ కండువా కప్పుకోవడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఆయనతో పాటు వందలాది మంది కార్యకర్తలు కూడా సైకిల్ పార్టీ వైపు అడుగులు వేయడం వైసీపీకి షాక్‌లా మారింది.ఒకప్పుడు జగన్ కోసం ప్రాణం ఇస్తామని చెప్పిన నేతలు కూడా పార్టీని వీడటం వైసీపీ పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది. ఇదే సమయంలో టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి చేసిన ప్రకటనలు కూడా కీలకంగా మారాయి. కొత్తగా వచ్చే వారికి పార్టీ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, ఎవరినీ బలవంతంగా రప్పించబోమని, కానీ స్వచ్ఛందంగా వస్తే మాత్రం ఆహ్వానిస్తామని ఆయన స్పష్టం చేశారు. దీంతో అసంతృప్త వైసీపీ నేతలు టీడీపీ వైపు చూస్తున్నారని రాజకీయ వర్గాలు అంటున్నాయి.ఇక ఓటు బ్యాంకు విషయంలోనూ మార్పు సంకేతాలు కనిపిస్తున్నాయని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఒకప్పుడు ప్రతి ఇంట్లో వైసీపీ మాట వినిపించేదని, ఇప్పుడు ఆ స్థాయి ఉత్సాహం కనిపించడం లేదని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పులివెందులలో సమర్థంగా అమలవుతున్నప్పటికీ, ప్రజల్లో రాజకీయ అభిరుచులు మారుతున్నాయన్న భావన బలపడుతోంది. రాబోయే మునిసిపల్ ఎన్నికల నాటికి ఈ ప్రభావం మరింత స్పష్టంగా బయటపడే అవకాశముందని అంచనా వేస్తున్నారు. మొత్తం మీద వైఎస్ జగన్‌కు బలంగా నిలిచిన పులివెందుల రాజకీయంగా క్రమంగా డైల్యూట్ అవుతోందన్న చర్చ ఇప్పుడు జోరుగా సాగుతోంది.

# పాపం... శీనన్న

విశాఖపట్టణం, జనవరి 19, విశాఖకు చెందిన మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ ఎక్కడ ఉన్నారన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. ఆయన వైసీపీకి రాజీనామా చేసి ప్రస్తుతం తన వ్యాపారాలను చూసుకుంటున్నారని మాత్రం చెబుతున్నారు. రాజకీయాలకు మాత్రం దూరంగా ఉంటున్నారు. రాజకీయాల్లోకి వేగంగా దూసుకు వచ్చి పార్లమెంటు సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా అయిన అవంతి శ్రీనివాస్ అంతే స్పీడ్ తో రాజకీయాల నుంచి బ్రేక్ ఇవ్వడంపై చర్చ జరుగుతంది. వైసీపీకి మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత ప్రస్తుతం రాజకీయంగా ఖాళీగానే ఉన్నారు. ఆయన తన విద్యాసంస్థలను చూసుకోవడానికే పరిమితయ్యారు. అయితే ఆయన వైసీపీకి రాజీనామా చేసి నెలలు గడుస్తున్నా ఏ పార్టీలో చేరలేదు.ఆయన పార్టీలో చేరాలనుకున్నప్పటికీ ఇప్పటికే విశాఖ ప్రాంతంలో అధికార పార్టీలో నేతలు ఎక్కువ కావడంతో పాటు ఆయనను చేర్చుకుంటే లేనిపోని తలనొప్పులు వస్తాయని భావించి ఏ పార్టీ కూడా ఆయనను దరిచేరనివ్వకపోవడంతోనే సమయం కోసం వెయిట్ చేస్తున్నారంటున్నారు. ఆర్థికంగా, సామాజికవర్గ పరంగా బలమైన నేతగా ఉన్న అవంతి శ్రీనివాస్ జనసేనలో చేరాలనుకున్నప్పటికీ అక్కడ ఎంట్రీ దొరకలేదు. ఇక టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లడంతో ఆయనను చేర్చుకోవడంపై స్థానిక టీడీపీ నాయకత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అందుకే అవంతి శ్రీనివాస్ ఇప్పుడు మన టైం బాగాలేదని భావించి రాజకీయాలకు దూరంగా ఉన్నారంటున్నారు.విశాఖ కార్పొరేటర్ గా ఉన్న తన కుమార్తె ను కూడా వైసీపీ మేయర్ పై అవిశ్వాసం తీర్మానం సందర్భంగా రాజీనామా చేయించారు. అయినా సరే అవంతి శ్రీనివాస్ ను మాత్రం ఎవరూ నమ్మడం లేదు. ఆయన మళ్లీ తమ పార్టీలోకి వస్తే రాజకీయంగా ఇబ్బందులే తప్ప అనవసరమన్న అభిప్రాయానికి వచ్చినట్లుంది.. వైసీపీకి రాజీనామా చేసిన తర్వాత అవంతి శ్రీనివాస్ జనసేనలో చేరేందుకు ప్రయత్నించారట. అయితే అక్కడ నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదని తెలిసింది. అవంతి శ్రీనివాస్ చేరికకు విశాఖ జనసేన నేతలతో పాటు రాష్ట్ర స్థాయి నేతలు కూడా అభ్యంతరం తెలిపారు. దీంతో ఆయన చేరికకు రెడ్ సిగ్నల్ పడటంతో ఇక అవంతి శ్రీనివాస్ ఖాళీగానే కూర్చున్నారు. సమయం వచ్చినప్పుడు వారే పిలుస్తారులే అన్న ధీమాతో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కాకపోయినా మళ్లీ పార్లమెంటు సభ్యుడిగానైనా పోటీకి అవకాశం దక్కుతుందని ఆయన భావిస్తున్నారు. మరి చూడాలి ఏం జరుగుతుందో?

# ఇచ్ఛాపురం కోసం మాస్టర్ ప్లాన్

శ్రీకాకుళం, జనవరి 19,వైసీపీ ఎన్ని రకాలుగా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా..ఇచ్ఛాపురంలో వైసీపీ జెండా ఎగరడం లేదు. అయితే నేతల గ్రూపుల గోలనే దీనికి కారణమంటూ చెప్పుకొస్తారు సిక్కోలు వైసీపీ లీడర్లు. ఇచ్ఛాపురం నుంచి బెందాళం అశోక్ టీడీపీ హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొందుతూ వస్తున్నారు.టీడీపీ ఆవిర్భావం తర్వాత ఇచ్ఛాపురం నియోజకవర్గం ఆ పార్టీకి కంచుకోటగా నిలుస్తోంది. అంతకుముందు కూడా కాంగ్రేసేతర అభ్యర్థులే ఎక్కువగా అక్కడ గెలుస్తూ వచ్చారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్ ఓటు బ్యాంకు వైసీపీవైపు మళ్లింది. కానీ టీడీపీ టీడీపీ ఓటు బ్యాంకు మాత్రం ఆ పార్టీకే ఉంది.ఫ్యాన్ పార్టీ ఆవిర్భావం తర్వాత ఇచ్ఛాపురం నుంచి 2014లో వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన నర్తు రామారావు ఓటమి చెందగా..2019లో పిరియా సాయిరాజ్‌ను పోటీకి దింపింది వైసీపీ. అతను కూడా ఓటమి చెందడంతో 2024 సార్వత్రిక ఎన్నికల ముందు సాయిరాజ్‌ను సమన్వయకర్తగా తప్పించి ఆ బాధ్యతలను ఆయన సతీమణి పిరియా విజయమ్మకు అప్పజెప్పారు. 2024 ఎన్నికల్లో విజయమ్మకి కూడా ఓటమి తప్పలేదు. దీంతో హ్యాట్రిక్ కొట్టారు బెందాళం అశోక్.ఈ సారి ఇచ్ఛాపురంలో ఎలాగైనా పాగా వేయాలని అధినేత జగన్ పట్టుదలతో ఉన్నారని చెప్పుకుంటున్నారు వైసీపీ నేతలు. వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛాపురం నుంచే వైసీపీ విజయ ఢంకా మోగించాలని పార్టీ నేతలకు టార్గెట్ ఫిక్స్ చేశారట వైసీపీ పెద్దలు. దానికి అనుగుణంగానే గేమ్ ప్లాన్ మారుస్తున్నారట. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జనాభా పరంగా రెడ్డిక సామాజిక వర్గంతో పాటు యాదవ, కళింగ, అగ్నికుల క్షత్రియ వర్గాల ఓటర్లు ఎక్కువగా ఉంటున్నారు.

అయితే గత రెండుసార్లు..కళింగ సామాజిక వర్గానికి చెందిన పిరియా సాయిరాజ్ కుటుంబానికే ఎమ్మెల్యే టికెట్ కేటాయించారు జగన్. రెండో సామాజిక వర్గం అయిన యాదవ్‌కు ఎమ్మెల్సీని ఇచ్చారు. అయినప్పటికీ నేతల మధ్య పొసగడం లేదు. గ్రూపు రాజకీయాలు రోజు రోజుకు పెరుగుతూనే ఉన్నాయి..తప్ప తగ్గడం లేదు. దీంతో మరో కొత్త నేతకు అవకాశం ఇచ్చారంటున్నారు అక్కడ క్యాడర్. సీనియర్ నేతలను పక్కన పెట్టి..గత ప్రభుత్వ హయాంలో రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేసిన శ్యాంప్రసాద్ రెడ్డికి..ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారంటున్నారు.ఇచ్ఛాపురం వైసీపీ బాధ్యతలు శ్యాంప్రసాద్ రెడ్డికి ఇవ్వడం వెనుక పెద్ద స్కెచ్చే ఉందనే చర్చ జరుగుతుంది. సిక్కోలు జిల్లాలో..ఎమ్మెల్యేగా ఉన్న బెందాళం అశోక్ కళింగ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో గత రెండు సార్లు కూడా కళింగ సామాజిక వర్గానికి చెందిన పిరియా సాయిరాజ్ దంపతులను బరిలో దించింది. అది పెద్దగా వర్కౌట్ అవ్వలేదు.దీంతో నియోజకవర్గంలో అధిక జనాభా కలిగిన రెడ్డిక సామాజికవర్గంపై ఫోకస్ పెట్టిందట వైసీపీ. రెడ్డిక వర్గం డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉండటంతో..ఈ సారి వైసీపీ పెద్దల ప్లాన్ వర్కౌట్ అవుతుందనే అంచనాలున్నాయట. ఇప్పటికే యాదవ సామాజిక వర్గానికి చెందిన కీలక నేత నర్తు రామారావుకి ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టారు.

దీంతో రెడ్డిక, కళింగ, యాదవ సామాజిక వర్గాలు తమకి కలిసి వస్తాయన్న లెక్కల్లో వేసుకుంటున్నారట ఫ్యాన్ పార్టీ లీడర్లు. అయితే గ్రూప్ రాజకీయాలకు పెట్టింది పేరుగా ఉన్న ఇచ్ఛాపురం వైసీపీలో శ్యాంప్రసాద్ రెడ్డి ఎలా నెగ్గుకు వస్తారనేది చర్చనీయాంశంగా మారింది. అందరినీ ఒక్కతాటిపైకి తీసుకొస్తే తప్ప విజయం అంత ఈజీ కాదని పొలిటికల్ వర్గాల్లో చర్చ నడుస్తుంది. మరి వైసీపీ కొత్త స్కెచ్ ఎంతవరకు సక్సెస్ అవుతందో చూడాలి మరి.

# జేసీ వర్సెస్ కేతిరెడ్డి...

అనంతపురం, జనవరి 19, ఎవ్వరికీ భయపడే ముచ్చటే లేదు. ఎట్లైతే గట్లాయె. ఏడికైతే గాడికాయే. బట్ వన్ కండీషన్. నీ ఫ్యామిలీ..నా ఫ్యామిలీనే తేల్చుకుందాం..అంటూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి సవాల్ చేశారు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి. రాయలసీమ పౌరుషంపై జేసీ ప్రభాకర్‌రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించిన పెద్దారెడ్డి..డేట్ టైం ఫిక్స్ చెయ్ అంటూ..బాలయ్య సినిమాలోని పాపులర్ మాస్ డైలాగ్‌ను రిపీట్ చేశారు.దీంతో తాడిపత్రిలో మళ్లీ రాజకీయ వేడి రాజుకుంటుంది. అటు జేసీ ఫ్యామిలీ ఇటు కేతిరెడ్డి పెద్దారెడ్డి హైవోల్టేజ్ పొలిటికల్ ఫైట్‌కు దిగుతున్నారు. ఇదంతా రాయలసీమ పౌరుషం మీద డిబేట్ అంటున్నారు. నేను రెడీ అంటే నేను రెడీ అంటూ..మీసాలు మెలేస్తున్నారు. లేటెస్ట్‌గా రాయలసీమ పౌరుషంపై తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నానని కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పష్టం చేశారు. అంతే కాదు ఎక్కడైనా ఎప్పుడైనా తాను చర్చకు రెడీ అంటూ బింగ్ సౌండ్ చేశారు పెద్దారెడ్డి.తాడిపత్రిని గత మూడు దశాబ్దాలుగా జేసీ ఫ్యామిలీ పాలిస్తే..తాను ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నానని..రెండు పాలనలపై చర్చకు సిద్ధమంటూ ఛాలెంజ్ చేస్తున్నారు కేతిరెడ్డి. డేట్ టైం మీరే ఫిక్స్ చేయండి అని జేసీ ప్రభాకర్ రెడ్డికే చాన్స్ ఇచ్చారు. అంతేకాదు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తాడిపత్రిలో అయినా లేక రాయలసీమ జిల్లాల్లో ఎక్కడైనా తాను చర్చకు రెడీగా ఉన్నాను అని ప్రతి సవాల్ చేశారు పెద్దారెడ్డి.జేసీ ఫ్యామిలీ పాలనలో మాజీ ఎమ్మెల్యేగా తనకే స్వేచ్ఛగా తిరిగే అవకాశం లేదని పెద్దారెడ్డి అంటున్నారు. తాను నియోజకవర్గంలోకి అడుగు పెట్టకుండా జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని పాలిస్తున్నారని ఫైర్ అవుతున్నారు. అలాంటి జేసీ ప్రభాకర్‌రెడ్డి రాయలసీమ పౌరుషం అంటూ తనకు సవాల్ విసరడం మీద తాను పాజిటివ్‌గానే రియాక్ట్ అవుతున్నానని..బహిరంగ చర్చకు తాను ఎప్పుడూ సిద్ధమే అని కేతిరెడ్డి ప్రకటించారు.అయితే ఓపెన్ డిబేట్‌కు ఓ కండీషన్ పెట్టారు పెద్దారెడ్డి. బహిరంగ చర్చకు జేసీ కుటుంబం, తన కుటుంబం మాత్రమే హాజరు కావాలని పెద్దారెడ్డి షరతు పెట్టారు. రెండు కుటుంబాల సమక్షంలోనే ఎవరి పాలన ఎలా ఉందనేది తేల్చుకుందామని అంటున్నారు. తాను ఎవరికీ దేనికీ భయపడేవాడిని కానని అంటున్న పెద్దారెడ్డి..దేఖ్ లేంగే అంటూ సవాల్ విసిరారు.గత కొన్ని రోజులుగా తాడిపత్రి చాలా సెన్సిటివ్ ఏరియాగా మారిపోయింది. ఎన్నికల రిజల్ట్ తర్వాత..అక్కడ రాజకీయ వేడి ఇంకా రాజుకుంది. ఆ తర్వాత కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి రాకుండా పోలీసులు అడ్డుకోవడం..మరింత రచ్చకు దారితీసింది.

ఈ క్రమంలోనే కోర్టుకెళ్లి ఆర్డర్స్ తెచ్చుకుని పోలీస్ బలగాల మధ్య పెద్దారెడ్డి తాడిపత్రిలోకి ఎంట్రీ ఇవ్వడం ఇంకా హాట్ టాపిక్ అయింది.ఇక అప్పటి నుంచి జేసీ ఎబ పెద్దారెడ్డి అన్నట్లుగా..సినిమాలో క్లైమాక్స్ రేంజ్‌లో పాలిటిక్స్ హీటెక్కుతున్నాయి. ఇద్దరు నేతలు సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకోవడంతో తాడిపత్రి ఫైట్ నెక్ట్స్ లెవల్‌కు చేరుకుంటుంది. పెద్దారెడ్డి కామెంట్స్‌పై జేసీ ఎలా రియాక్ట్ అవుతారో.? బిగ్ డిబేట్‌కు సిద్ధపడుతారో.? లేక డైలాగ్‌వార్‌కే పరిమితం అవుతారో చూడాలి మరి.

# ఈ నెల 24 న బాలాపూర్ లొఓ ధర్మ రక్షణ సభ

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ గ్రామంలోని గణేష్ చౌక్ వేదికగా గణేష్ సేన ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన 'ధర్మ రక్షణ సభ' నిర్వహించనున్నట్లు బాలాపూర్ గ్రామస్తులు ప్రకటించారు. ఈ సందర్భంగా సోమవారం బాలాపూర్ లో విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మద్దతుతో జరగనున్న ఈ సభలో రోహింగ్యాల వల్ల ఎదురవుతున్న భద్రతా పరమైన సవాళ్లపై గళమెత్తనునున్నట్టు తెలిపారు.స్థానికంగా నివసిస్తున్న రోహింగ్యాలు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, పేలుడు పదార్థాలతో వారికి సంబంధాలు ఉన్నాయనే అనుమానాలపై చర్చించి, హైదరాబాద్లో అక్రమంగా నివాసం ఉంటున్న రోహింగ్యాలపై రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమస్యను పార్లమెంటులో చర్చించాలని అన్ని రాజకీయ పార్టీలను, అలాగే రోహింగ్యాల వల్ల మైనారిటీ వర్గాలకు కలుగుతున్న ఇబ్బందులను గమనించి వారిపై నిఘా ఉంచాలని ఎంఐఎం నేతలను కూడా కోరనున్నామని, రోహింగ్యాల కారణంగా తమ నిత్యజీవితంలో భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని, పనులకు ఆటంకం కలుగుతోందని బాలాపూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమ సన్నాహక సమావేశంలో బాలాపూర్ గ్రామస్తులు, నాయకులు కోలన్ శంకర్ రెడ్డి, చిగురింత నరసింహారెడ్డి, సింగిరెడ్డి పెంటారెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, గుండుజి రఘునందన్ చారి, పోరెటి శ్రీనివాస్ రెడ్డి, బాల్లింగని జంగయ్య, నవారు శ్రీనివాస్ రెడ్డి, బోర్ర రవి, మేకల సంజీవ, గిరికటి కృష్ణంరాజు గౌడ్, కొంతం ప్రకాశ్ రెడ్డి, టేకుల శశిధర్ రెడ్డి, కోటగిరి మురళి, కళ్లెం లక్ష్మారెడ్డి, ఇక శ్రీను, దొడ్డి శ్రీశైలం, మైపాల్ రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పలు హిందూ సంఘాల ప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు ఈ సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు..

# బౌల్ ఆఫ్ అన్నపూర్ణ ట్యాగ్ మిస్..

విజయవాడ, జనవరి 19, సంక్రాంతి పండుగ వేళ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్ గారు సోషల్ మీడియా వేదికగా విశ్లేషించారు. ఒకప్పుడు భారతదేశానికే అన్నపూర్ణగా నిలిచిన ఆంధ్రప్రదేశ్, నేడు వరి ఉత్పత్తిలో పొరుగు రాష్ట్రం తెలంగాణ కంటే వెనుకబడిపోవడంపై ఆయన గణాంకాలతో సహా ఆత్మపరిశీలన చేయాలని కోరారు.

పదేళ్లలో తలకిందులైన లెక్కలు

గత దశాబ్ద కాలంలో వరి ఉత్పత్తిలో రెండు రాష్ట్రాల మధ్య వ్యత్యాసం భారీగా పెరిగిందని పీవీ రమేష్ గారు ఎత్తి చూపారు. 2015లో: ఆంధ్రప్రదేశ్ 74.9 లక్షల టన్నుల ఉత్పత్తితో అగ్రస్థానంలో ఉండగా, తెలంగాణ ఉత్పత్తి కేవలం 30.5 లక్షల టన్నులు మాత్రమే ఉండేది.

2025లో: పదేళ్ల తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆంధ్రప్రదేశ్ ఉత్పత్తి 73.4 లక్షల టన్నులకు స్వల్పంగా తగ్గగా, తెలంగాణ ఉత్పత్తి 168.8 లక్షల టన్నులకు పెరిగింది.

తెలంగాణ దూకుడు.. ఏపీ స్తబ్దత

పదేళ్ల క్రితం ఏపీ కంటే సగం లోపు ఉత్పత్తి ఉన్న తెలంగాణ, నేడు ఐదు రెట్లు వృద్ధి సాధించి దేశానికే ధాన్యాగారంగా ఎదిగిందని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో ఏపీలో స్వల్ప క్షీణత నమోదు కావడం విచారకరమని, ఇది రైతుల శ్రమ లోపం కాదని, ప్రభుత్వాల విధానపరమైన నిర్ణయాల లోపమని ఆయన విశ్లేషించారు. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు, పక్కా ప్రణాళికలు ఆ రాష్ట్రాన్ని ముందుకు నడిపితే, ఏపీలో నాయకత్వ పటిమ, అమలులో వేగం తగ్గడం ఈ స్థితికి కారణమని పేర్కొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు ముప్పు

ఆంధ్రప్రదేశ్ లో వ్యవసాయ రంగం వాటా 30 శాతానికి పైగా ఉండటంతో పాటు, 50 శాతానికి పైగా ప్రజలకు ఇదే జీవనాధారమని, ఇంతటి కీలక రంగం కునారిల్లడం రాష్ట్ర భవిష్యత్తుకే ముప్పు అని ఆయన హెచ్చరించారు. కేవలం నినాదాలతో సరిపెట్టకుండా, ఈ సంక్రాంతికి నూతన సంకల్పంతో ఏపీ తన సముచిత స్థానాన్ని తిరిగి దక్కించుకోవాలని పిలుపునిచ్చారు.

# ఎదురు కాల్పులలో ఆరుగురు మావోయిస్టులు మృతి



రాయ్ పూర్ ఛత్తీస్గఢ్లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు సమాచారం. నిఘావర్గాల సమాచారం మేరకు, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు సున్నం చంద్రయ్య, పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో ఇన్ఛార్జి పాపారావు, నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా ఉన్నారని బలగాలు ఆపరేషన్ చేపట్టాయి.

# ఏపీలో సర్ ప్రక్రియ..

విజయవాడ, జనవరి 19, ఆంధ్రప్రదేశ్ లో ఈ ఏడాది ఏప్రిల్?మే మధ్యలో ఓటర్ల సమగ్ర సర్వే నిర్వహించేందుకు ఎన్నికల యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ ప్రక్రియ ద్వారా 2004 నుంచి ఇప్పటివరకు ఉన్న ఓటర్ల జాబితాలను పూర్తిగా సవరించనున్నారు. మరణించిన వారు, వలస వెళ్లిన వారు, చిరునామా మార్చుకున్న వారి పేర్లను జాబితాల నుంచి తొలగించడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశ్యం.

అయితే ఈ ఓటర్ల జాబితాల సవరణ వ్యవహారం దేశవ్యాప్తంగా ఇప్పటికే పెద్ద చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. అధికార పార్టీలకు అనుకూలంగా ఉన్న ఓట్లు కొనసాగిస్తూ, వ్యతిరేక పార్టీలకు చెందిన ఓట్లను తొలగిస్తున్నారన్న ఆరోపణలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ విమర్శలు ఉన్నప్పటికీ కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను కొనసాగిస్తోంది.

ఆంధ్రప్రదేశ్లో ఈ సర్వేను ఏప్రిల్ నుంచి ప్రారంభించి కేవలం 60 రోజుల వ్యవధిలో పూర్తిచేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నిర్ణయాన్ని భారతీయ జనతా పార్టీ), తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నేతలు స్వాగతిస్తున్నారు. ఓటర్ల జాబితాలు శుద్ధిగా ఉండాలంటే ఈ తరహా సర్వే అవసరమేనని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ అంశంపై వైసీపీ తీవ్ర సందేహాలు వ్యక్తం చేస్తోంది. గత ఎన్నికల అనంతరం ఈవీఎంల అనుమానాలు వ్యక్తం చేసిన పార్టీ, ఇప్పుడు ఎన్నికల సంఘం పనితీరుపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ సర్ ప్రక్రియ తమ పార్టీకి నష్టం కలిగించేలా ఉండొచ్చన్న ఆందోళన వైసీపీ నేతల్లో కనిపిస్తోంది. పారదర్శకంగా ఈ సర్వే నిర్వహించకపోతే న్యాయపోరాటానికి వెళ్తామంటూ పలువురు నేతలు టీవీ చర్చల్లో హెచ్చరికలు కూడా చేస్తున్నారు. అయితే ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి ఈ అంశంపై పలు పిటిషన్లు సుప్రీంకోర్టు లో పెండింగ్లో ఉన్నప్పటికీ, ఎన్నికల సంఘం మాత్రం తన విధానాన్ని అమలు చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో వైసీపీ చేపట్టే న్యాయపోరాటం కోర్టుల వరకే పరిమితమయ్యే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియను ఆపడం అంత సులభం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాజకీయంగా మరో కీలక చర్చ కూడా తెరపైకి వచ్చింది. సర్ ప్రక్రియ ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్న వాదన వినిపిస్తోంది. తమిళనాడు లో కొనసాగుతున్న సర్వేలో దాదాపు కోటి మంది ఓటర్లను జాబితాల నుంచి తొలగించినట్లు సమాచారం. అలాగే బీహార్ లో గతంలోనే సుమారు 64 లక్షల ఓట్లు తొలగించారన్న గణాంకాలు బయటకు వచ్చాయి. ఈ ఉదాహరణలను చూస్తే, ఆంధ్రప్రదేశ్లో ఎంతమంది ఓటర్లు తొలగించబడతారన్నది ఆసక్తికరంగా మారింది. ఇలా జరిగితే అది వైసీపీకి భారీ రాజకీయ నష్టాన్ని తెచ్చిపెట్టే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలే బహిరంగంగా అంగీకరిస్తున్నారు. ముఖ్యంగా తమకు బలంగా ఉన్న ఓటు బ్యాంక్పై ఈ సర్వే ప్రభావం పడుతుందన్న భయం కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే, ఓటర్ల సర్వే ప్రక్రియ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రానున్న రోజుల్లో మరింత వేడి పెంచే అంశంగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# ఇక ఇండియాలనే రాఫెల్స్..

ముంబై జనవరి 19, (న్యూస్ పల్స్) భారత్ మరోసారి ఫ్రాన్స్తో రక్షణ ఒప్పందం కుదుర్చుకునే దిశగా అడుగులు వేస్తోంది. రక్షణ మంత్రిత్వ శాఖ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద భారత వైమానిక దళం కోసం 114 రాఫెల్ ఫైటర్ ఎయిర్క్రాఫ్ట్ల తయారీకి ఆమోదం తెలిపింది. దాదాపు రూ. 3.24 లక్షల కోట్ల అంచనా వ్యయంతో కూడిన ఈ ఒప్పందం ప్రపంచంలోనే అతిపెద్ద ఫైటర్ ఎయిర్క్రాఫ్ట్ తయారీ ఒప్పందాలలో ఒకటిగా నిలవనుంది. ఈ క్రమంలో రాఫెల్ ఫైటర్ జెట్లు భారతదేశంలో తయారైతే, వాటిని ఇతర దేశాలకు విక్రయించవచ్చుతాజా నివేదికల ప్రకారం, ఫ్రాన్స్లోని డసాల్ట్ ఏవియేషన్ తర్వాత రాఫెల్ ఫైటర్ జెట్ల కోసం భారత్ను రెండవ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్గా మార్చాలని భావిస్తోంది. అంటే, భారతదేశంలో తయారు చేసే ఫైటర్ జెట్స్ భారత వైమానిక దళం అవసరాలకు మాత్రమే పరిమితం కావు. ఇక్కడ తయారు చేసిన యుద్ధ విమానాలను అంతర్జాతీయ ఎగుమతి ఆర్డర్లను పూర్తి చేయడానికి కూడా ఉపయోగించవచ్చు. మహారాష్ట్రలోని నాగ్పూర్లోని ఓఎఊంఔ ప్రత్యేక ఆర్థిక జోన్ (ఙఇజ)లో ప్రత్యేక రాఫెల్ ఫైనల్ అసెంబ్లీ లైన్ ఏర్పాటు చేయనుంది. ఈ సౌకర్యం సంవత్సరానికి 24 ఫైటర్ జెట్లను తయారు చేస్తుందని ప్రస్తుతానికి భావిస్తున్నారు. పూర్తి యుద్ధ విమానాల ఎగుమతిలో నియంత్రణ లేదా దౌత్యపరమైన అడ్డంకులు ఎదురైనా భారతదేశం నిర్వహణ, మరమ్మత్తు, ఓవరాల్ ఎగుమతుల ద్వారా ప్రయోజనం పొందనుంది. రాఫెల్ ఫైటర్ జెట్స్ ఉపయోగించే దేశాలకు భారతదేశం ప్రాంతీయ ఓఖీూ హబ్గా అభివృద్ధి కానుంది. భారతదేశంలో రాఫెల్ ఫైటర్ జెట్లను తయారు చేయడంలో అతిపెద్ద ప్రయోజనం స్వదేశీ ఆయుధాలు, మన వ్యవస్థలను అనుసంధానం చేయడం. భారతదేశంలో తయారు చేసిన రాఫెల్లో భారత క్షిపణులు, అంటే ఎక్స్ట్రా బియాండ్ విజువల్ రేంజ్ ఎయిర్ టు ఎయిర్ మిసైల్స్ వంటివి అమర్చుతారు. ఇది ఒక ప్రత్యేకమైన ఇండియన్ రాఫెల్ వేరియంట్ను సృష్టిస్తుంది. రాఫెల్ ఫైటర్ జెట్ ప్రధాన మేధో సంపత్తి హక్కులు ఫ్రాన్స్ వద్దే ఉంటాయని మీకు తెలుసా. మేక్ ఇన్ ఇండియా ఫ్రేమ్వర్క్ కింద భారత రాఫెల్ ప్రోగ్రామ్లో దాదాపు 60% స్వదేశీకరణను ఆశిస్తున్నారు. ఈ చర్య తరువాత, రాఫెల్ తయారీ భారతదేశాన్ని ఫైటర్ ఎయిర్క్రాఫ్ట్లను ఎగుమతి చేసే దేశాల ఎలైట్ క్లబ్లో చేర్చుతుందని కేంద్రం ప్లాన్ చేసింది. ఇది భారతదేశ రక్షణ దౌత్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది, వేలాది మందికి ఉపాధిని కూడా అందిస్తుంది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల రివర్స్ ఫిరాయింపులు

హైదరాబాద్, జనవరి 19, తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇందులో మెజారిటీ ఎమ్మెల్యేలు తాము ఇప్పటికీ బీఆర్ఎస్ సభ్యులమేనని స్పీకర్కు నివేదించడం, చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకోవడానికే కాకుండా, క్షేత్రస్థాయిలో మారుతున్న రాజకీయ సమీకరణాలకు కూడా అద్దం పడుతోంది. కేవలం సాంకేతికంగానే కాకుండా, రాజకీయంగా కూడా వీరు కాంగ్రెస్ వైఖరితో విసిగిపోయి మళ్లీ సొంత గూటికి చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాంగ్రెస్లో చేరడం తాను చేసిన ఒక తప్పటడుగు అని ఆయన బహిరంగంగానే పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తన నియోజకవర్గానికి గానీ, వ్యక్తిగతంగా తనకు గానీ కనీసం వెంట్రుక వాసి కూడా ప్రయోజనం కలగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మూడుసార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించిన గులాబీ జెండా పట్ల కృతజ్ఞతగా ఉండాలని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులనే గెలిపించాలని ఆయన తన అనుచరులకు పిలుపునివ్వడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. మరోవైపు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా ఇదే తరహా ధోరణిని ప్రదర్శిస్తున్నారు. గతంలోనే ఆయన కాంగ్రెస్లో చేరిన కొద్ది రోజులకే తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరినట్లుగా ప్రచారం చేయించుకున్నారు. తాను ఎప్పుడూ బీఆర్ఎస్ను వీడలేదని, కేవలం అభివృద్ధి పనుల నిమిత్తమే ముఖ్యమంత్రిని కలిశానని ఆయన స్పష్టం చేస్తున్నారు. స్పీకర్ ముందు కూడా తాము పార్టీ మారలేదని వాదించడం ద్వారా, అనర్హత వేటు నుంచి తప్పించుకోవడమే కాకుండా, కాంగ్రెస్ పార్టీలో తమకు దక్కుతున్న ప్రాధాన్యతపై అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలు మళ్లీ బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారనేది స్పష్టమ వుతోంది. ఈ పరిణా మాలు అధికార కాంగ్రెస్ పార్టీకి మింగుడుపడని అంశాలుగా మారాయి. చేర్చుకున్న ఎమ్మెల్యేలు గోడ మీద పిల్లి వాటంగా వ్యవహ రిస్తుండటం, ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని పిలుపునివ్వడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. స్పీకర్ నిర్ణయం ఎలా ఉన్నా, ప్రజల్లో ఈ ఎమ్మెల్యేల విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతున్నప్పటికీ, వీరు మళ్లీ బీఆర్ఎస్కు దగ్గరవ్వడం ఆ పార్టీ క్యాడర్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. కానీ వారిని మళ్లీ పార్టీలోకి తీసుకోవద్దన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది.

# 10 అంతస్థులు దాటితే అంతే

హైదరాబాద్, జనవరి 19, హైదరాబాద్ నగరాభివృద్ధి దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రియల్ ఎస్టేట్ రంగాన్ని నేరుగా ప్రభావితం చేసేలా టీడీఆర్ విధానంలో కీలక మార్పులు చేస్తూ పురపాలక శాఖ జీవో నెం. 16ను విడుదల చేసింది. చెరువులు, నదుల పరిరక్షణతో పాటు భూసేకరణను వేగవంతం చేయడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఈ సవరించిన నిబంధనలు ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో అమలులోకి రానున్నాయి. ఈ పరిధిలోని 300 డివిజన్లలో ఇకపై జరిగే నిర్మాణాలు కొత్త టీడీఆర్ నిబంధనలకు లోబడి ఉండాల్సి ఉంటుంది. నగరంలో హైరిస్ భవనాల నిర్మాణాన్ని నియంత్రించేలా ప్రభుత్వం కీలక షరతును విధించింది. ఇకపై 10 అంతస్తులు దాటే ప్రతి భవనానికి టీడీఆర్ తప్పనిసరి కానుంది. 11వ అంతస్తు నుంచి పై అంతస్తుల వరకు నిర్మించే మొత్తం విస్తీర్ణంలో 10 శాతానికి సమానమైన టీడీఆర్ సర్టిఫికెట్లు బిల్డర్లు సమర్పించాల్సి ఉంటుంది. దీంతో ఇప్పటివరకు మార్కెట్లో వినియోగం లేక నిల్వగా ఉన్న టీడీఆర్ బాండ్లకు డిమాండ్ పెరగనుంది. భూమిని ప్రభుత్వానికి ఉచితంగా అప్పగించే బిల్డర్లకు ప్రత్యేక రాయితీలు కూడా ఈ జీవోలో పొందుపరిచారు. సెట్బ్యాక్ నిబంధనల్లో, భవన ఎత్తు పరిమితుల్లో సడలింపులు కల్పిస్తూ వారిని ప్రోత్సహించనున్నారు. దీని ద్వారా భూసేకరణ ప్రక్రియ సులభతరం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

చెరువులు, నదుల పరిరక్షణకు సంబంధించి భూముల స్వాధీనంపై కూడా ప్రభుత్వం ఆకర్షణీయమైన విధానాన్ని ప్రకటించింది. ఎఫ్టీఎల్ పూర్తిస్థాయి నీటి మట్టం పరిధిలో ఉన్న పట్టా భూములకు 200 శాతం టీడీఆర్, చెరువుల బఫర్ జోన్లలో ఉన్న భూములకు 300 శాతం టీడీఆర్, బఫర్ వెలుపల అభివృద్ధి పనుల కోసం భూములు సేకరిస్తే 400 శాతం టీడీఆర్ ఇవ్వాలని నిర్ణయించింది. ఒక ఎకరాకు మించి భూసేకరణ జరిగితే ఆ ప్రతిపాదనను ప్రభుత్వం నేరుగా పరిశీలించనుంది. మూసీ నది పరీవాహక ప్రాంతం, నగరంలోని చెరువుల సుందరీకరణ పనులకు భూ యజమానుల నుంచి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించడమే ఈ విధాన మార్పుల లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. గతంలో ప్రభుత్వం జారీ చేసిన దాదాపు 10 వేల కోట్ల రూపాయల విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లు మార్కెట్లో పేరుకుపోయి వాటి ధర గణనీయంగా పడిపోయింది. దీంతో భూ యజమానులు టీడీఆర్కు బదులుగా నగదు పరిహారం కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ఇప్పుడు పెద్ద భవనాల నిర్మాణానికి టీడీఆర్ తప్పనిసరి చేయడంతో బిల్డర్లు వాటిని కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది.

దీంతో టీడీఆర్ మార్కెట్ మళ్లీ కదలికలోకి రావడంతో పాటు, ప్రభుత్వంపై నగదు పరిహారం భారం తగ్గనుంది. ఫలితంగా నిధుల కొరతతో నిలిచిపోయిన రోడ్ల విస్తరణ పనులు, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులు వేగం అందుకునే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ఫ్యాన్స్ కలెక్షన్ వార్...

హైదరాబాద్, జనవరి 19, సినిమా అనేది చాలా మంది ఓ వ్యసనం. తెలుగు వారికి ఇంకా ఎక్కువ. యువతలోనూ సినిమాలపై ఆసక్తి ఉంటుంది. అయితే మంచి వినోదం ఆస్వాదించడానికి ఈ సినిమా పిచ్చి రావడం లేదు? సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ఫ్యాన్ వార్స్ చేసుకోవడానికి, కలెక్షన్ల లెక్కల పంచాయతీలు పెట్టుకోవడానికి సినిమాను చూస్తున్నారు. సినిమాను కేవలం వినోదంగా చూడటం మానేసి, దానిని ఒక వ్యక్తిగత యుద్ధంగా మార్చుకోవడం ప్రమాదకరంగా మారుతోంది. సోషల్ మీడియాలో ఏ చిన్న హీరో సినిమా విడుదలైనా, కలెక్షన్ల పోస్టర్ల మీద పెద్ద ఎత్తున యుద్ధం మొదలవుతోంది. తమ అభిమాన హీరోకి వంద కోట్లు వచ్చాయంటే, కాదు కాదు రెండొందల కోట్లు వచ్చాయంటూ ఫేక్ డేటాతో పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. ఈ కలెక్షన్ల వల్ల నిజంగా లాభపడేది సదరు హీరోలు, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు మాత్రమే. సినిమా హిట్టయితే హీరో రెమ్యూనరేషన్ పెరుగుతుంది, నిర్మాత లాభాల బాట పడతాడు. కానీ, గొంతు చించుకుని సోషల్ మీడియాలో పోరాడే అభిమానికి, ఆ కలెక్షన్ల నుండి ఒక్క రూపాయి కూడా రాదు సదా, వారి వ్యక్తిగత జీవితానికి ఇది ఏ రకంగానూ ఉపయోగపడదు. సినిమా రంగం అనేది వేల కోట్ల రూపాయల వ్యాపారం. ఇక్కడ హీరోలు, దర్శకులు ఒక ప్రాజెక్ట్ తర్వాత మరో ప్రాజెక్ట్ చేసుకుంటూ తమ కెరీర్ను నిర్మించుకుంటారు. హీరోలందరూ ఎంతో స్నేహంగా మెలుగుతుంటే, బయట వారి అభిమానులు మాత్రం కుల, మత, ప్రాంతాల వారీగా చీలిపోయి బూతులు తిట్టుకోవడం అత్యంత దౌర్భాగ్యం. ఒక హీరోను ఇష్టపడటంలో తప్పు లేదు, కానీ ఆ ఇష్టం ఇతర హీరోలను ద్వేషించే స్థాయికి చేరడం మానసిక వైకల్యమే అవుతుంది. వినోదం కోసం కేటాయించాల్సిన సమయాన్ని, ఈ అర్థం లేని గొడవలకు కేటాయించడం వల్ల జీవితంలో అత్యంత కీలకమైన యువతరం సమయం వృధా అవుతోంది. యువత గుర్తించాల్సిన ప్రాథమిక సూత్రం ఒకటే జీవితం అనేది సినిమా కంటే చాలా పెద్దది. కెరీర్ నిర్మించుకోవాల్సిన వయసులో, కుటుంబ బాధ్యతలు స్వీకరించాల్సిన సమయంలో, సినిమా కలెక్షన్ల గురించి సోషల్ మీడియాలో పోరాటాలు చేయడం వల్ల భవిష్యత్తు అంధకారమవుతుంది. సినిమాను థియేటర్లో చూసి, ఆ వినోదాన్ని అక్కడితో వదిలేయాలి. రికార్డులు, కలెక్షన్ల వేటలో పడి వ్యక్తిత్వాలను దిగజార్చుకోవడం ఆపేయాలి. హీరోలు తమ పని తాము చేసుకుపోతున్నప్పుడు, అభిమానులు కూడా తమ జీవితాలను చక్కదిద్దుకోవడమే నిజమైన స్టార్డమ్ అనిపించుకుంటుంది.

# క్రిషాంక్ కు కలిసి రాని కాలం

హైదరాబాద్, జనవరి 19, భారత రాష్ట్ర సమితి రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని చలాయించింది. రెండు పర్యాయాలు కూడా ప్రతిపక్షాన్ని తొక్కి అవతలపడేసింది. ఇతర పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలను ఆపరేషన్ ఆకర్ష్ ద్వారా చేర్చుకుంది. 2023లో మాత్రం భారత రాష్ట్ర సమితి పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో వ్యతిరేకమైన ఫలితం వచ్చింది. హ్యాట్రిక్ సాధించాలని కలలు గన్న గులాబీ పార్టీకి చుక్కెదురైంది. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉంది గులాబీ పార్టీ. పార్టీ అధికారం లేకపోయినప్పటికీ.. సోషల్ మీడియా మాత్రం బలంగా ఉంది. గులాబీ పార్టీ సోషల్ మీడియాను ఈ స్థాయిలో బలోపేతం చేసిన వ్యక్తుల్లో క్రిషాంక్ కచ్చితంగా ఉంటారు. ఈయన కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అల్లుడు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిగా తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. అనేక పర్యాయాలు జైలుకు కూడా వెళ్లి వచ్చారు. గులాబీ పార్టీకి కీలకమైన సమాచారం అందించడంలో ఈయన దిట్ట అని చెబుతుంటారు. క్రిషాంక్ కంటోన్మెంట్ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా గెలవాలని భావిస్తున్నారు. 2023లో టికెట్ లభిస్తుందని అనుకున్నప్పటికీ అవకాశం రాలేదు. అప్పుడు గులాబీ పార్టీ సాయన్న కుమార్తెకు అవకాశం ఇచ్చింది. సాయన్న కుమార్తె చనిపోవడంతో.. మళ్లీ క్రిషాంక్ కు టికెట్ ఇస్తారని ప్రచారం జరిగింది. కానీ, ఈసారి కూడా రిక్త హస్తమే మిగిలింది. దీంతో క్రిషాంక్ ఎమ్మెల్యే ఆశలు నెరవేరలేదు. ప్రస్తుతం గులాబీ పార్టీలో సోషల్ మీడియాను ముందుండి నడిపిస్తున్నారు క్రిషాంక్. అయితే ఆయన ఎంతో శ్రమ పడుతున్నప్పటికీ.. గులాబీ పార్టీలో కొంతమంది వ్యక్తులు ఆయనను నాయకుడిగా చూడడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు క్రిషాంక్ కు టికెట్ లభించలేదు. అప్పుడు ఆయన మామ సర్వే సత్యనారాయణకు టికెట్ ఇచ్చారు. దీంతో దానిని కారణంగా చూపి క్రిషాంక్ గులాబీ పార్టీలో చేరారు. అక్కడ కూడా ఆయనకు అవకాశం లభించడం లేదు. సికింద్రాబాద్ నగరానికి సంబంధించి గులాబీ పార్టీని పర్యవేక్షిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్.. కంటోన్మెంట్ ఏరియా కు గులాబీ పార్టీకి సంబంధించి కొత్త బాధ్యులు వస్తారని ప్రకటించారు. ఆ సమావేశానికి క్రిషాంక్ ను పిలవలేదు. క్రిషాంక్ ఆశల మీద తలసాని శ్రీనివాస్ యాదవ్ నీళ్లు చల్లుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్రిషాంక్ పార్టీ కోసం తీవ్రంగా కష్టపడుతున్నారు. అనేక కేసులను ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాలలో దాడులకు కూడా గురయ్యారు. ఈ పరిణామాలు క్రిషాంక్ ను ఆవేదనకు గురి చేస్తున్నాయని అతడి అభిమానులు అంటున్నారు. ఆయన చేస్తున్న పోరాటానికి గుర్తింపు ఏ మాత్రం లభించడం లేదని అభిమానులు వాపోతున్నారు. కేటీఆర్ తో బలమైన బంధం ఉన్నప్పటికీ.. క్రిషాంక్ ను పార్టీ అధిష్టానం ఎందుకు గుర్తించడం లేదో అర్థం కావడం లేదు. కేటీఆర్ మీద సంపూర్ణ విశ్వాసంతో ఉన్నానని అనేక సందర్భాలలో క్రిషాంక్ చెప్పారు. క్రిషాంక్ కు కూడా కేటీఆర్ హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. దీనికి తోడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కంటోన్మెంట్ విషయంలో వేలు పెట్టడంతో అసలు క్రిషాంక్ రాజకీయ భవిష్యత్తు ఏమిటో అర్థం కావడం లేదు.

# ట్రాఫిక్ చక్ర బంధనం నుంచి బయటకు ఎలా...

హైదరాబాద్, జనవరి 19, తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో సైబర్ నేరాలను, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మాదకద్రవ్యాల సరఫరాను ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రస్తుతం, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టారు. ఆ దిశగా యువ ఐపిఎస్ అధికారులకు ఆ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతో పాటు కొత్తగా రూపుదిద్దుకుంటున్న 'ఫ్యూచర్ సిటీ' పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ బదిలీల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.జిల్లాల్లో అదనపు ఎస్పీలుగా సమర్థవంతంగా పనిచేస్తున్న యువ అధికారులను ఎంపిక చేసి, వారికి నగరంలో ట్రాఫిక్ డిసిపిలుగా పోస్టింగులు ఇచ్చారు.

ఈ బదిలీల్లో భాగంగా కొత్తగూడెం ఆపరేషన్స్ అదనపు ఎస్పీగా ఉన్న అవినాష్ కుమార్ ను హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి-1 (ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లు) గానూ, ఉట్నూరు అదనపు ఎస్పీగా ఉన్న కాజల్ ను హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి-2 (గోల్కొండ, జూబ్లీహిల్స్ జోన్లు) గానూ నియమించారు. అదేవిధంగా జగిత్యాల అదనపు ఎస్పీ ఎస్. శేషాద్రిని రెడ్డిని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి-2 (కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లు) బాధ్యతల్లోకి తీసుకురాగా, భువనగిరి అదనపు ఎస్పీ కనకాల రాహుల్ రెడ్డికి మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ డిసిపి-1 బాధ్యతలు అప్పగించారు.ములుగు జిల్లా ఆపరేషన్స్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న శివం ఉపాధ్యాయను ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ' కమిషనరేట్ ట్రాఫిక్ డిసిపిగా నియమించడం విశేషం. రైల్వేస్ డిఐజి హోదాలో ఉన్న జి. చందనా దీప్తిని ఫ్యూచర్ సిటీ అడ్మిన్ మరియు ట్రాఫిక్ అదనపు సీపీగా నియమించగా, హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపిగా ఉన్న బికే రాహుల్ హెగ్డేను అదే కమిషనరేట్ లో ట్రాఫిక్ డిసిపి-3 (చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్లు) గాను, సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపిగా ఉన్న జి. రంజన్ రతన్ కుమార్ ను అక్కడే ట్రాఫిక్ డిసిపి-1 (శేర్లింగంపల్లి జోన్) గాను ప్రభుత్వం బదిలీ చేసింది.అదేవిధంగా, రాష్ట్రవ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా వంటి అక్రమాలను అడ్డుకునేందుకు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్‌లో డిఐజి గా అభిషేక్ మహంతిని నియమించారు. తద్వారా సహజ వనరుల లూటీని అరికట్టడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా కఠిన చర్యలు చేపట్టనున్నారు.

మొత్తంగా చూస్తే, తాజా ఐపిఎస్ అధికారుల బదిలీల్లో అటు అనుభవానికి, ఇటు యువత ఉత్సాహానికి సమ ప్రాధాన్యం కల్పిస్తూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది.

# 300 కోట్ల క్లబ్ లో మనశంకరవరప్రసాద్



హైదరాబాద్, జనవరి 19, మెగాస్టార్ చిరంజీవి 'భోళా శంకర్' ఫ్లాప్ నుంచి బౌన్స్ బ్యాక్ అయ్యారు. సంక్రాంతికి విడుదలైన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో భారీ హిట్ కొట్టారు. బాక్స్ ఆఫీస్ దగ్గర సరికొత్త రికార్డులను ఈ సినిమా క్రియేట్ చేస్తోంది. ఇప్పటి వరకు ఈ సినిమా నాలుగు రికార్డులు క్రియేట్ చేసింది. అవి ఏమిటో చూద్దాం. నార్త్ అమెరికాలో 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా కలెక్షన్స్ 2.5 మిలియన్ డాలర్స్ దాటాయి. అంతే కాదు మెగాస్టార్ చిరంజీవి కెరీర్లో నార్త్ అమెరికా ఆల్ టైం హైయ్యస్ట్ గ్రాసింగ్ ఫిలిం కింద ఈ సినిమా రికార్డు సృష్టించింది.'మన శంకర వరప్రసాద్ గారు' క్రియేట్ చేసిన మరొక రికార్డు ఏమిటి అంటే... ఈ సినిమా విడుదలైన అన్ని ఏరియాలలో బ్రేక్ ఈవెన్ అయింది. డిస్ట్రిబ్యూటర్లకు కొన్న అమౌంట్ కంటే ఎక్కువ కలెక్షన్స్ రాబట్టి వాళ్లకు లాభాలు అందించడం మొదలు పెట్టింది.ఖైదీ నెంబర్ 150' సినిమాతో మెగాస్టార్ చిరంజీవి రీ ఎంట్రీ ఇచ్చారు. ఆ సినిమా సంక్రాంతికి విడుదల అయ్యి భారీ విజయం సాధించింది. అలాగే బాబీ దర్శకత్వంలో నటించిన 'వాల్తేరు వీరయ్య' కూడా సంక్రాంతి రిలీజ్. ఆ సినిమా కూడా విడుదల విజయం సాధించింది. ఇప్పుడు 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో... రీ ఎంట్రీలో సంక్రాంతి బరిలో చిరంజీవి తర్వాత ముచ్చటగా మూడో విజయాన్ని అందుకున్నారు. సంక్రాంతికి విడుదలైన చిరంజీవి మూడు సినిమాలు బాక్స్ ఆఫీస్ దగ్గర 100 కోట్ల షేర్ అందుకున్నాయి. వీటితో పాటు 'సైరా నరసింహా రెడ్డి' కూడా 100 కోట్ల షేర్ అందుకుంది. సంక్రాంతికి రికార్డు ఏమిటంటే... 'మన శంకర్ వరప్రసాద్ గారు' ఐదు రోజులకే 100 కోట్ల షేర్ సాధించడం. ఆరు రోజుల్లో అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ కావడం. ఆల్రెడీ ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 260 కోట్లకు పైగా గ్రాస్ సాధించింది. ఆ ఘనత కేవలం ఆరు రోజుల్లో చేరుకుంది. లాంగ్ రన్ కంప్లీట్ అయ్యేసరికి 500 కోట్లు వసూలు చేసే అవకాశం ఉందని సమాచారం.

# ప్రారంభమైన పులుల లెక్కలు...

మహబూబ్ నగర్, జనవరి 19, పులుల లెక్క, మొత్తం అటవీ జీవవైవిధ్యాన్ని అంచనా వేయడానికి అటవీ శాఖ సిద్ధమైంది. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2026ను నిర్వహించడానికి సన్నాహాలు పూర్తి చేసింది. రాష్ట్రంలో పులులు, వాటి ఆహారమైన శాఖాహార జంతువులను కూడా లెక్కిస్తారు.ఈ కార్యక్రమంలో భాగంగా 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న 3,053 అటవీ ప్రాంతాలలో క్షేత్రస్థాయి డేటా సేకరణ జరుగుతుంది. ఈ సర్వేలో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్, వన్యప్రాణుల అభయారణ్యాలు, అభయారణ్యాలు, ఇతర అటవీ ప్రాంతాలు ఉంటాయి. తెలిసిన పులుల కదలిక జోన్‌లపై మాత్రమే కాకుండా.. వాటి ఆవాసాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తారు. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ, వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఈ లెక్కింపు జరుగుతుంది.శిక్షణ పొందిన అటవీ శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు ట్రాన్సెక్ట్ లైన్లు వేయడం ద్వారా, టైగర్ పగ్‌మార్క్‌లు, స్కాట్ నమూనాలు, స్క్రాచ్ మార్క్‌లు వంటి సంకేతాలను నమోదు చేయడం ద్వారా క్షేత్రస్థాయి సర్వేలను నిర్వహిస్తారు. అటవీ నివాస పరిస్థితులు, మానవ కార్యకలాపాల ప్రభావంపై డేటాను కూడా మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగించి సేకరిస్తారు.ఈ కార్యక్రమంలో 1,129 మంది వాలంటీర్లు నమోదు చేసుకున్నారని అధికారులు తెలిపారు. చిచిఈ, ఊమిఎఊూ, యానిమల్ వారియర్స్, డెక్కన్ బర్డర్స్, ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ వంటి ప్రభుత్వేతర సంస్థలు దాదాపు 430 మంది శిక్షణ పొందిన సభ్యులతో ఈ కార్యక్రమానికి మద్దతు ఇస్తున్నాయి. అటవీ విభాగాల అవసరాల ఆధారంగా జిల్లా వారీగా వాలంటీర్లను నియమించారు. శాఖాపరమైన పర్యవేక్షణలో డేటా సేకరణలో సహాయం చేస్తారు. సేకరించిన డేటాను కెమెరా ట్రాపింగ్, శాస్త్రీయ విశ్లేషణతో కూడిన తదుపరి దశలలో పులుల సంఖ్య, ఇతర వన్యప్రాణుల స్థితిని సమగ్రంగా అంచనా వేయడానికి ఉపయోగిస్తారు.పులి అడుగులు, చెట్లకు గోకే గుర్తులు, మలం ఆధారంగా వాటి ఆచూకీ తెలుసుకుంటారు.

ఇందుకోసం టెక్నాలజీని వాడుతారు. ఇప్పటిదాకా పులుల సంఖ్యపై కచ్చితమైన సమాచారం లేదు. దీంతో వాటి సంరక్షణ చర్యలు ఇబ్బందులు అయ్యేవి. తాజాగా పులుల గణనతో ఆ సమస్య తీరనుంది.

రాబందును పట్టించిన జీపీఎస్

మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం బహిరన్ దిబ్బ గ్రామ శివారులో ఒక రాబందు కనిపించింది. నిజానికి రాబందులు కనిపించడం అరుదు కదా. దీంతో గ్రామస్థుల్లో భయం మె?దలైంది. ఆకాశం నుంచి అకస్మాత్తుగా వచ్చిన ఈ పక్షిని చూసిన జనాలు ఆలోచనల్లో పడ్డారు. ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఇక ఆ పక్షి కాళ్లకు స్టిక్కర్లు, నంబర్లు, చిన్న పరికరాలు ఉండటంతో ఆశ్చర్యంగా చూశారు.అయితే కొందరు యువకులు పరికరాలను చూసి ఏదైనా గూఢచారి పక్షి కావొచ్చు అని అనుమానం వ్యక్తం చేశారు. మరికొందరైతే గ్రామానికి ఏదైనా కీడు జరుగుతుందని కూడా మాట్లాడుకున్నారు. ఈ రాబందుకు సంబంధించిన విషయం సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. ఈ విషయం అటవీ శాఖ అధికారులకు కూడా తెలిసింది. దీంతో వారు రంగంలోకి దిగారు.

దీనిపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వికాస్ క్లారిటీ ఇచ్చారు. దేశంలో అంతరించిపోతున్న రాబందుల జాతిని కాపాడేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంరక్షణ ప్రాజెక్టును అమలు చేస్తోందన్నారు.

ఇందులో భాగంగానే.. రాబందుల కదలికలు, నివాస ప్రాంతాలు, ఆహార లభ్యత లాంటి అంశాలను అధ్యయనం చేసేందుకు వాటి కాళ్లకు జీపీఎస్ ట్రాకర్లు, గుర్తింపు ట్యాగులు అమర్చుతున్నారన్నారు.

ఈ రాబందులు దేశవ్యాప్తంగా ఎక్కడ తిరిగినా.. వాటి లొకేషన్‌ను వైల్డ్ లైఫ్ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు.

ఈ టెక్నాలజీ ద్వారా రాబందుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన శాస్త్రీయ సమాచారం సేకరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. రాబందుల రక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. ఈ పక్షులకు హాని కలిగించినా.., పట్టుకునేందుకు ప్రయత్నించినా.. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థులు ఎలాంటి భయం లేకుండా రాబందును పట్టించుకోకుండా వెళ్లాలని చెప్పారు.

# అటు ఎండ ఇటు చలి

హైదరాబాద్, జనవరి 19, తెలంగాణలో వింత వాతావరణం నెలకొంది. పగటిపూట ఎండలు మండిపోతుంటే.. రాత్రిళ్లు చలి వణికిస్తోంది. ఆదిలాబాద్‌లో 34.3 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు.. తిర్యాణిలో 7 డిగ్రీలకు పడిపోయాయి. రానున్న మూడు రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ విభిన్న వాతావరణంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచన.తెలంగాణ రాష్ట్రంలో వింత వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు పగటిపూట భానుడు తన ప్రతాపాన్ని చూపుతుంటే.. మరోవైపు రాత్రి సమయాల్లో చలి పులి పంజా విసురుతోంది. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఇక్కడ సాధారణం కంటే 4.2 డిగ్రీలు అధికంగా నమోదై.. 34.3 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో కూడా పగటి పూట ఎండ తీవ్రత సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరగడం విశేషం. జనవరి మూడవ వారంలోనే ఈ స్థాయిలో ఎండలు ఉండటం చూస్తుంటే.. రాబోయే వేసవి కాలం ఎంత తీవ్రంగా ఉండబోతుందోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది.పగటిపూట ఎండలు మండిపోతుంటే.. రాత్రి నుంచి ఉదయం వరకు మాత్రం చలి వణికిస్తోంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో అత్యల్పంగా 7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే ఆదిలాబాద్‌లోని భీంపూర్, సంగారెడ్డి జిల్లా కోహీర్, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగానే నమోదయ్యాయి. రాష్ట్రంలోని దాదాపు 13 జిల్లాల్లో చలి తీవ్రత పెరిగి ఉష్ణోగ్రతలు 2 నుంచి 5.4 డిగ్రీల వరకు తగ్గుముఖం పట్టాయి.వాతావరణ శాఖ సూచనల ప్రకారం.. రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. అయితే పగటిపూట ఆకాశం నిర్మలంగా ఉండటం వల్ల సూర్యరశ్మి నేరుగా భూమిని తాకి పగటి ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణమవుతోంది. రాత్రిపూట గాలిలోని తేమ శాతం తగ్గడం వల్ల చలి తీవ్రత అధికంగా ఉంటోంది. ఈ భిన్న వాతావరణం వల్ల ప్రజలు ఆరోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఖమ్మం జిల్లాలో రెండో జాతీయ రహదారి

ఖమ్మం, జనవరి 19, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మరో జాతీయ రహదారి మంజూరైంది. ఈ రహదారి అందుబాటులోకి వస్తే కొత్తగూడెం నుండి హైదరాబాద్‌కు ప్రయాణ దూరం 40 కిలోమీటర్లు తగ్గుతుంది. ఇల్లెందు, మహబూబాబాద్, తొర్రూరు మీదుగా గౌరెల్లి జంక్షన్ వరకు ఈ రహదారిని నిర్మించనున్నారు. ఇందుకోసం ఇల్లెందు, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లోని సుమారు 4.85 హెక్టార్ల భూసేకరణకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న రెండు వరుసల రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులకు రవాణా రంగంలో ఒక గొప్ప శుభవార్త అందుతోంది. జిల్లా మీదుగా మరో సరికొత్త జాతీయ రహదారి రాబోతోంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను పారిశ్రామిక కేంద్రమైన కొత్తగూడెంతో అనుసంధానించే జాతీయ రహదారి 930పీ నిర్మాణ పనుల్లో ఇప్పుడు కీలక ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తూ కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ తాజాగా గెజిట్ (3డీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది జిల్లా ప్రగతికి సరికొత్త బాటలు వేయనుంది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండా వెళ్లే రెండో జాతీయ రహదారిగా ఇది నిలవనుంది. ఇల్లెందు మరియు కొత్తగూడెం మధ్య ఉన్న మూడు మండలాల్లోని సుమారు 4.85 హెక్టార్ల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇల్లెందు మండలంలోని సుదిమళ్ల, టేకులపల్లి మండలంలోని బేతంపూడి, గొల్లపల్లి మరియు లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ వంటి గ్రామాల్లో భూసేకరణ జరగనుంది.

ఈ భూములకు సంబంధించి మార్కెట్ విలువ ప్రకారం రైతులకు త్వరలోనే నష్టపరిహారం చెల్లించనున్నారు.ప్రస్తుతం కొత్తగూడెం నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే ఖమ్మం లేదా సూర్యాపేట మీదుగా వెళ్లాల్సి వస్తోంది. కానీ ఈ కొత్త జాతీయ రహదారి 930పీ అందుబాటులోకి వస్తే.. ఇల్లెందు, మహబూబాబాద్, తొర్రూరు, వలిగొండ మీదుగా నేరుగా హైదరాబాద్‌లోని గౌరెల్లి జంక్షన్‌ను చేరుకోవచ్చు. దీనివల్ల దాదాపు 40 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా గణనీయంగా ఆదా అవుతుంది.ఈ రహదారి కేవలం ప్రయాణికులకే కాకుండా.. పారిశ్రామిక రవాణాకు వెన్నెముకగా మారుతుంది.

జిల్లాలో ఉన్న మైనింగ్, యంత్రాల రవాణా సులభతరమవుతుంది. అలాగే, హైదరాబాద్ నుండి భద్రాచలం వెళ్లే భక్తులకు కూడా ఇది సులభమైన ప్రత్యామ్నాయ మార్గంగా నిలుస్తుంది. అత్యవసర వైద్య సేవల కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన వారికి ఈ రోడ్డు ఒక వరప్రదాయినిలా మారనుంది.

ప్రమాదాలను తగ్గించేలా ప్రస్తుతం ఉన్న రెండు వరుసల రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరిస్తుండటం విశేషం.

# మద్యం డబ్బులు చెల్లించండి డిస్టలరీస్ వార్నింగ్

హైదరాబాద్, జనవరి 19, తెలంగాణ ప్రభుత్వం నుంచి రావాల్సిన వేల కోట్ల రూపాయల బకాయిలు ఇప్పుడు రాష్ట్ర పారిశ్రామిక ప్రతిష్టను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వేదిక 2026 దావోస్ సదస్సు మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో, మద్యం తయారీ పరిశ్రమల సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలు జారీ చేశాయి. సుమారు రూ. 3,900 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించకపోతే, రాష్ట్రానికి వచ్చే కొత్త పెట్టుబడులు ఆగిపోవడమే కాకుండా, ప్రస్తుతం ఉన్న ఇన్వెస్టర్ల నమ్మకం కూడా సన్నగిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి.(బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా , కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బెవరేజెస్ కంపెనీస్) సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశాయి. తెలంగాణ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ తమకు రూ. 3,900 కోట్లు చెల్లించాల్సి ఉందని, అందులో రూ. 900 కోట్లు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించాయి. డియాజియో, పెర్నోడ్ రికార్డ్, యునైటెడ్ బ్రూవరీస్ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులు ఈ బకాయిల అంశంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు."రాష్ట్ర ఖజానాకు మద్యం రంగం భారీగా ఆదాయాన్ని సమకూరుస్తుంది. ఒప్పందం ప్రకారం 45 రోజుల్లో చెల్లింపులు చేయాల్సి ఉండగా, నెలల తరబడి జాప్యం చేయడం వల్ల సరఫరా గొలుసు దెబ్బతింటుంది. ఇది ఉద్యోగాలపై కూడా ప్రభావం చూపుతుంది" అని ఈ మూడు సంఘాలు పేర్కొన్నాయి.తెలంగాణలో పారిశ్రామిక పెట్టుబడులు గత ఏడాదితో పోలిస్తే సగానికి పైగా పడిపోయాయి. 2023-24లో రూ. 28,100 కోట్లుగా ఉన్న పెట్టుబడులు, 2024-25 నాటికి రూ. 13,730 కోట్లకు పడిపోవడం గమనార్హం. బకాయిల చెల్లింపులో జాప్యం కూడా ఇందుకు ఒక కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.మరోవైపు, తెలంగాణ ఎక్సైజ్ ఆదాయం గత పదేళ్లలో నాలుగు రెట్లు పెరిగింది. 2013-14లో రూ. 9,000 కోట్లుగా ఉన్న ఆదాయం, 2023-24 నాటికి రూ. 38,000 కోట్లకు చేరుకుంది. కేవలం అక్టోబర్ 2025లోనే లైసెన్స్ ఫీజుల ద్వారా ప్రభుత్వం రూ. 3,000 కోట్లు వసూలు చేసింది. ఇంత భారీ ఆదాయం వస్తున్నా, సరఫరాదారులకు బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని కంపెనీలు ప్రశ్నిస్తున్నాయి."ముఖ్యమంత్రిని 2024 జూలైలో కలిసినప్పుడు మూడు నెలల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ 2025 జనవరి నాటికి మళ్లీ చెల్లింపులు ఆగిపోయాయి. ఇది చాలా క్లిష్టమైన పరిస్థితి" అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక మద్యం కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణలో బీర్ మార్కెట్‌లో 70 శాతం వాటా కలిగిన యునైటెడ్ బ్రూవరీస్ ఇప్పటికే కు సరఫరా నిలిపివేసింది. పెరిగిన ముడిసరుకు ఖర్చులకు అనుగుణంగా ధరలు సవరించకపోవడం, పాత బకాయిలు పేరుకుపోవడంతో కార్యకలాపాలు నిర్వహించడం భారంగా మారిందని సంస్థ తెలిపింది. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలో పన్నుల పెంపు వల్ల సేల్స్ తగ్గిన నేపథ్యంలో, మద్యం కంపెనీలకు తెలంగాణ కీలక మార్కెట్. కానీ ఇక్కడి చెల్లింపుల జాప్యం వారిని అయోమయంలో పడేస్తోంది.వెంటనే లైసెన్స్ వేలం ద్వారా వచ్చిన నిధులతో బకాయిలు చెల్లించి, ఇన్వెస్టర్లలో భరోసా నింపాలని పరిశ్రమ వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

# పెళ్లి ప్రయాణీకుల బస్సు బోల్తా.. ఐదుగురు మృతి, 85 మందికి గాయాలు



లతేహర్, జనవరి 19: జార్ఖండ్ రాష్ట్రం లతహార్ జిల్లా మహువాడండ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓర్సా వ్యాలీ ప్రాంతంలో బస్సు బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు చనిపోగా.. 85మంది గాయపడ్డారు. గాయపడిన వారిని మహువాడండ్ లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బస్సులోని ప్రయాణికులు ఛత్తీస్ గఢ్ లోని బలరాంపూర్ నుంచి లోధ్ ఫాల్ కు స్కూల్ బస్సులో వెళ్తున్నట్లు సమాచారం. వీరంతా పెళ్లి కార్యక్రమానికి వెళ్తున్నారు.

ప్రమాదాన్ని చూసిన వెంటనే స్థానికులు, సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో బస్సులో 90 మందికి పైగా ప్రయాణిస్తున్నారని అధికారులు తెలిపారు. ఇప్పటివరకూ బస్సు కింద చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన ఐదుగురు మహిళల మృతదేహాలను వెలికితీశారు. బస్సు కింద మరిన్ని మృతదేహాలు కనిపించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

బస్సులోని ప్రయాణీకులు ఛత్తీస్ఘడ్ లోని బలరంపూర్ జిల్లా నుంచి లేట్హార్లోని మహువాడండ్లో జరిగిన వివాహానికి వెళ్లినట్టు సమాచారం. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు సూపరింటెండెంట్ కుమార్ గౌరవ్ తెలిపారు.

# మేడారం టిక్కెట్స్ ఫిక్స్...

వరంగల్, జనవరి 19, మేడారం సమ్మక్క?సారక్క జాతరకు వెళ్లే భక్తుల కోసం తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి వెళ్లే టిక్కెట్ చార్జీలను ఖరారు చేసింది. హైదరాబాద్ నుంచి రూ.600 నుంచి రూ.1,110 వరకు.. వరంగల్ నుంచి రూ.250 నుంచి రూ.500 వరకు చార్జీలు నిర్ణయించింది. అలాగే భూపాలపల్లి, ఖమ్మం, గోదావరిఖని, కొత్తగూడెం వంటి ప్రాంతాల నుంచి కూడా ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగుతుందని ఆర్టీసీ స్పష్టం చేసింది.మేడారం సమ్మక్క?సారక్క జాతరకు వెళ్లే భక్తుల కోసం తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ మహా జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని తగ్గించడంతో పాటు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇప్పటికే వివిధ ప్రాంతాల వేల సంఖ్యలో బస్సులను మేడారానికి తరలించగా.. తాజాగా దీనికి అనుగుణంగా వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి వెళ్లే బస్సుల టిక్కెట్ చార్జీలను ఖరారు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.హైదరాబాద్, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, భూపాలపల్లి, ఏటూరునాగారం, ఖమ్మం, గోదావరిఖని, కొత్తగూడెం వంటి ప్రాంతాల నుంచి మేడారానికి ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి తీసుకువచ్చింది. బస్సుల రకాన్ని బట్టి చార్జీలు నిర్ణయించారు. హైదరాబాద్ నుంచి ప్రయాణించే వారికి సూపర్ లగ్జరీ, రాజధాని, డీలక్స్, ఎక్స్‌ప్రెస్, సాధారణ, గరుడ ప్లస్ బస్సులు నడపనున్నారు. వీటికి టిక్కెట్ ధరలు రూ.600 నుంచి రూ.1,110 వరకు ఉంటాయి.అలాగే వరంగల్, హనుమకొండ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది భక్తులు మేడారానికి వెళ్తుండటంతో అక్కడి నుంచి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వరంగల్, హన్మకొండ నుంచి టిక్కెట్ చార్జీ రూ.250 నుంచి రూ.500 వరకు నిర్ణయించారు. భూపాలపల్లి నుంచి రూ.230 నుంచి రూ.300 వరకు, మహబూబాబాద్ నుంచి రూ.360 నుంచి రూ.410 వరకు చార్జీలు ఉంటాయి. ఖమ్మం నుంచి రూ.480, గోదావరిఖని నుంచి రూ.400, కొత్తగూడెం నుంచి రూ.350 చార్జీగా నిర్ణయించారు. కరీంనగర్ నుంచి మేడారానికి వెళ్లే బస్సుకు రూ.390గా నిర్ణయించారు.ముఖ్యంగా 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగుతుందని తెలంగాణ ఆర్టీసీ స్పష్టం చేసింది. భక్తుల సౌకర్యార్థం అదనపు బస్సులు, ప్రత్యేక సిబ్బంది, భద్రతా చర్యలు కూడా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. జాతరకు వెళ్లే భక్తులు ముందస్తుగా ప్రణాళిక చేసుకొని ప్రయాణించాలని సూచించారు.

మహిళల శక్తితో మేడారం

సమ్మక్క సారక్క దేవతల జాతరకు వేళయింది..ఈసారి జాతర చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా చిత్ర విచిత్రాలు ఆశ్చర్య పరుస్తున్నాయి.. ఈసారి జాతర పూర్తిగా నారీమణుల పెత్తనంలోనే సాగనుంది.. పూర్తిగా మహిళల చేత ట్రస్ట్ బోర్డ్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేశారు.. మంత్రి సీతక్క వినూత్న ఆలోచనతో పూర్తిగా అతివల చేత అమ్మల జాతర జరిపించేందుకు సిద్ధమయ్యారు.. చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, 11 మంది డైరెక్టర్లు 1 ఎక్స్ అఫీషియ సభ్యులతో కలిసి మొత్తం 14 మందితో మేడారం ఉత్సవ కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు..ఓరుగల్లు పేరు చెప్పగానే రాని రుద్రమదేవి పౌరుషం గుర్తుకొస్తుంది.. నారీమణుల నవశాఖానికి ఓరుగల్లు ఆడబిడ్డల పౌరుషాన్ని చిహ్నంగా భావిస్తారు.. సమ్మక్క సారక్క దేవతలను వీరవనితలుగా.. ధీరత్వానికి.. పౌరుషానికి.. ప్రతీకలుగా కొలుస్తారు.. పాలకుల ప్రయోగంతో ఓరుగల్లు స్త్రీ శక్తికి చిహ్నంగా నిలుస్తుంది.. ఇప్పటికే వరంగల్ ఉమ్మడి జిల్లా అంతా అతివల పాలనలోనే కొనసాగుతుంది.. తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ లో ఇద్దరు మహిళా మంత్రులు ఉండగా ఆ ఇద్దరు కొండా సురేఖ, సీతక్క వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందినవారే కావడం విశేషం?వీళ్ళిద్దరు మాత్రమే కాదు.. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు గా డాక్టర్ కడియం కావ్య, వరంగల్ మేయర్ గా గుండు సుధారాణి ప్రజా ప్రతినిధులుగా కొనసాగుతున్నారు.. వరంగల్ కలెక్టర్ గా సత్యశారదాదేవి, హనుమకొండ కలెక్టర్ గా స్నేహ శబరిష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా చాహత్ వాజ్ పాయ్, వరంగల్ సెంట్రల్ జోన్ పోలీస్ కమిషనర్ గా సరిత స్త్రీ శక్తిని చాటుతున్నారు.తాజాగా నవశకానికి నాంది పలికిన మంత్రి సీతక్క మేడారం జాతరలో ఓ వినూత్న ప్రయత్నం చేశారు.. మేడారం జాతర ఉత్సవ కమిటీ పగ్గాలు మహిళలకే కట్ట బెట్టారు.. చైర్ పర్సన్ గా ఇరుప స్వరూపతో పాటు మరో 12 మంది మహిళా డైరెక్టర్లు, ఒకరు ఎక్స్ అఫీషియా సభ్యుడి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అతివల బాధ్యతల స్వీకరణ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు.. ధీరత్వానికి ప్రతీకగా కొలబడే సమ్మక్క సారక్క దేవతలే నారేమణులకు స్ఫూర్తి అంటున్న మంత్రి సీతక్క.. ఈసారి పూర్తిగా మహిళల చేతుల మీదుగా జాతర బాధ్యతలు నిర్వహించడం ఓ వరంగా భావిస్తున్నారు.. సమ్మక్క సారక్క దేవతల స్ఫూర్తితో జాతర నిర్వహణలో స్త్రీ శక్తిని చాటుతామన్నారు..రాష్ట్రంలో ఎక్కడా.. ఎప్పుడు కని విని ఎరుగని విధంగా పూర్తిగా మహిళలకే పరిపాలన పగ్గాలు అప్పచెప్పి..ఇంత పెద్ద జాతర నిర్వహణ వారి భుజస్కందాలపై పెట్టడం చర్చగా మారింది.. శ్రీ శక్తిని నిరూపించుకునే గొప్ప అవకాశం లభించిందని తమకు లభించిందనీ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ చైర్ పర్సన్ తో సహా డైరెక్టర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు..మేడారం జాతర చరిత్రలో ఇప్పటికే అనేక అద్భుతాలు అబ్బుర పరుస్తుండగా.. తాజాగా నారీమణుల చేతికి పరిపాలన పగ్గాలు అప్ప చెప్పడం మరింత చర్చగా మారింది.. ఇంతపెద్ద జాతర నిర్వహణ బాధ్యతలు వారి భుజాలపై వేసుకున్న అతివలు సమ్మక్క సారక్క స్ఫూర్తితో సక్సెస్ చేస్తారని ఆశిద్దాం.

# 150 మందితో శాఖాహార ర్యాలీ

హైదరాబాద్: పిరామిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో మైహిదిపట్నం, దత్తాత్రేయ కాలనీ, మురాద్ నగర్, ఆసిఫ్ నగర్ ప్రాంతాల్లో సుమారు 150 మందితో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సొసైటీ సభ్యులు, సాధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ, మనిషికి శాఖాహారమే సరైన ఆహారమని, ఇది మానసిక సమతుల్యతకు, బుద్ధి వికాసానికి దోహదపడుతుందని తెలిపారు. శాఖాహారం తీసుకోవడం ద్వారా సకల జంతువుల పట్ల కరుణ, దయ, ప్రేమ భావాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ శాఖాహారాన్ని అవలంబించడమే సకల ప్రాణుల పట్ల పరమ ధర్మంతో వ్యవహరించడమని వారు అభిప్రాయపడ్డారు.

అలాగే శ్వాసపై ధ్యాస పెట్టి ధ్యానం చేయాలని సూచించారు. ధ్యానం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, సంకల్పశక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు.

ఈ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన పెంచేందుకు దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు.

# దేవాలయాల భద్రతకు చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్ తెలంగాణ భజరంగ్ సేన ఆధ్వర్యంలో కాచిగూడలోని జాతీయ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా ప్రతిభావంతుడైన యువకుడు ఈషాన్ గణేష్ యెల్దేను భజరంగ్ సేన నేతలు ఘనంగా సత్కరించారు. ఔరోరా యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈషాన్, "మిస్టర్ టీన్ ఆఫ్ సౌత్ ఇండియా ? ఫస్ట్ రన్నర్ అప్" అవార్డు సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన సందర్భంగా భజరంగ్ సేన నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొని క్యాలెండర్ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన లక్ష్మణ్, రాష్ట్రవ్యాప్తంగా హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.దేవాలయాల భద్రతకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ సేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలవరం ప్రాజెక్ట్ చేరుకున్న విదేశీ నిపుణుల బృందం

## స్వాగతం పలికిన అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు

పోలవరం, జనవరి 19: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పురోగతిని పరిశీలించేందుకు విదేశీనిపుణుల బృందం ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతానికి సోమవారం చేరుకుంది.బృందంలో విదేశీ నిపుణులు సీన్ హించిబెర్గర్ , డేవిడ్ బి పాల్ , జియాన్ ఫ్రాంకో డి సీకో ఉన్నారు.వీరు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతంలో ఆరో విడత పర్యటిస్తున్నారు. వీరి వెంట కేంద్ర జల సంఘంలోని వివిధ విభాగాల అధికారులు సరబ్జిత్ సింగ్ బక్షి , మనీష్ రాథోర్, గౌరవ్ తివారి, హేమంత్ గౌతమ్, సిఎస్ఎంఆర్ఎస్ అధికారులు మనీష్ గుప్తా , రవి అగర్వాల్ , సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రతినిధి వి ఎస్ రామారావు, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం రఘురాం, డైరెక్టర్ కె శంకర్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ సలహాదారు ఎం వెంకటేశ్వర రావు, ఎన్ ఐ ఆర్ ఎం డైరెక్టర్ అజయ్ కుమార్ నైతాని ,సీడీఓ చీఫ్ ఇంజనీర్ ఉన్నారు. వీరికి జలవనరుల శాఖ ఈ ఎన్ సి కే నరసింహమూర్తి , పోలవరం ఎస్ ఈ రామచంద్ర రావు, ఏం ఈ ఐ ఎల్ జనరల్ మేనేజర్ గంగాధర్,.డి జి ఎం మురళి పమ్మి స్వాగతం పలికారు.

# షాద్ నగర్ నుండి తిరుమలకు పాదయాత్ర

# ప్రారంభించిన బండ్ల గణేష్

షాద్ నగర్ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో నిర్మాత బండ్ల గణేష్ సంకల్ప యాత్ర పేరుతో షాద్ నగర్ పట్టణంలోని తన సినిమా థియేటర్ నుండి తిరుమల తిరుపతి వెంకన్న సన్నిధికి పాదయాత్రను ప్రారంభించారు. బండ్ల గణేష్ మీడియాతో మాట్లాడుతూ.... వైసిపి ప్రభుత్వం లో చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టడంతో మనస్థాపంతో తిరుమల వెంకటేశ్వర స్వామి కి మొక్కుకున్నని స్వామి దయతోనే చంద్రబాబు నాయుడు జైలు నుండి విడుదలవడమే కాకుండా ఆంధ్రప్రదేశ్లోని గత ఎన్నికల్లో అత్యద్భుతమైన మెజారిటీతో గెలుపొంది ప్రభుత్వాన్ని నెలకొల్పారన్నారు. ఈ సంకల్పయాత్ర కేవలం తన మొక్కు కోసమేనని రాజకీయ లబ్ధి కోసం కాదని తెలిపారు.

# మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా విలేజ్ హెల్త్ క్లినిక్ లు:

### గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

### నందివాడలో రూ.36లక్షలతో ఎ.ఊ.అ భవనానికి శంకుస్థాపన

### నందివాడ మండలంలో రూ.1.80 కోట్లతో..విలేజ్ హెల్త్ క్లినిక్ లు నిర్మిస్తున్నాం:

### భవనాల నిర్మాణానికి స్వచ్ఛందంగా దాతలు ముందుకు వచ్చి సహకరించడం శుభ పరిణామం

### భవన నిర్మాణాలను త్వరగతిన పూర్తిచేసి.... హెల్త్ క్లినిక్స్ సేవలు ప్రజలకు అందుబాటులోకి తెస్తాం

నందివాడ మండలం జనవరి19: గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా.... కూటమి ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు చేస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో హెల్త్ క్లినిక్స్ సేవలు చేస్తున్నామన్నారు.

మండల కేంద్రమైన నందివాడ గ్రామంలో రూ.36 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న... విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులకు కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము భూమి పూజ నిర్వహించి సోమవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా భవన నిర్మాణానికి 6 సెంట్లు స్థలాన్ని దాతృత్వంగ అందించిన వేములపల్లి కాశి వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే రాము అభినందించారు.

అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.... మండలంలో ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో ఐదు హెల్త్ క్లినిక్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే నాలుగు క్లినిక్ ల నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయని, వాటిని త్వరగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే రాము అన్నారు.

గ్రామాల్లో ఈ క్లినిక్ ల ఏర్పాటు ద్వారా ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ అవుతాయన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ఇలాంటి మంచి కార్యక్రమాలకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సహకరించడం శుభపరిణామం అన్న ఎమ్మెల్యే రాము, స్థలదాతలకు ధన్యవాదాలు చెప్పారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా నందివాడ మండలంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. గ్రామాల సమగ్ర అభ్యున్నతే లక్ష్యంగా... నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే రాము ఉద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్డబ్ల్యుసి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, మండల టిడిపి అధ్యక్షుడుదానేటి సన్యాసిరావు, టిడిపి నాయకులు ఆరికేపూడి రామశాస్త్రి, సీతయ్య,ప్రభాకర్ రెడ్డి, సల్మాన్ రాజ్,యేసుపాదం, మసిముక్కు వేణు, మురళి, ఉప్పల వెంకటేశ్వరరావు,ఆఅ యేసు బాబు,అంజిరెడ్డి, బాబిరెడ్డి, సుంకర శ్రీను, సతీష్, భద్రం, లక్ష్మీపతి, నందివాడ గ్రామ నాయకులు దారం శ్రీనివాసరావు, నిమ్మకూరు జోలయ్య, ఏడుకొండలు, అశోకు, నేరుసు నాగరాజు, వీర్ల లోకేష్, మందపాటి నాగరాజు, యాదయ్య, వెయ్యల నాగయ్య, ఓఖఆూ మల్లీశ్వరి, ఆఇ రవి, ంఇ ఖఫీ రవి, డాక్టర్ జాయిస్. మంజుష, డాక్టర్ స్ఫూర్తి సింధూశా, తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కలను చంపడంపై తీవ్రస్థాయిలో స్పందించిన రేణు దేశాయ్



హైదరాబాద్ వీధి కుక్కలను చంపడంపై సినీనటి జంతు ప్రేమికురాలు రేణు దేశాయ్ తీవ్రస్థాయిలో స్పందించారు. కేవలం కుక్కల వల్ల మృతి చెందిన వాటినే ప్రాణాలుగా పరిగణిస్తూ రోడ్డు ప్రమాదాలు దోమలతో చనిపోయిన వారివి ప్రాణాలు కాదా అని ప్రశ్నించారు. 100 కుక్కల లో ఐదు కుక్కలు మాత్రమే అగ్రెసివ్ స్వభావం కలిగి ఉంటాయని అన్నారు. అలాంటి ఐదు కుక్కల కోసం మిగిలిన 95 కుక్కలను చంపుతారా అంటూ ప్రశ్నించారు. ఈ భూమిపై ప్రతి జీవికి జీవించే హక్కు ఉందని నిస్సహాయతతో ఉన్న కుక్కలను దారుణంగా చంపడం దారుణమని అన్నారు.

కాలభైరవుడిగా పూజలు అందుకుంటున్న శునకాలను ఎలా హత్య చేయాలనిపిస్తుంది అని ప్రశ్నించారు. ప్రభుత్వాల వైఫల్యాల వల్లనే వీధి కుక్కల ప్రమాదాలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏ బి సి, వ్యాక్సినేషన్స్ వేస్తే పరిష్కారమయ్యే సమస్యను జటిలం చేసి కుక్కలు మరణాలకు కారణం అవుతున్నారని మండిపడ్డారు. దేశంలో ప్రతినిత్యం రోడ్డు ప్రమాదాలు, దోమ కాటుతో మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు ఎన్నో, మానవత్వం వీడి కుటుంబ సభ్యులనే హతమరుస్తున్న సంఘటనలో లక్షలాది ప్రాణాలు పోతున్నాయని అన్నారు. వాటన్నిటినీ వదిలిపెట్టి కేవలం కుక్కల వల్ల చనిపోయిన ప్రాణాలను మాత్రమే ప్రాణాలుగా పరిగణిస్తే ఎలా అని నిలదీశారు. తనకు 45 సంవత్సరాలు వచ్చాయని ఇప్పటివరకు ఏ వీధి కుక్క తనపై దాడికి పాల్పడలేదని చెప్పారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఒక రకమైన తీర్పులను వెలువడిస్తే వాటిని మరోరకంగా అర్థం చేసుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుడు విధానాలతో కుక్కలను పూర్తిగా సంహరించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయి అని మండిపడ్డారు. భారత దేశంలో వేస్ట్ మేనేజ్మెంట్ సక్రమంగా నిర్వహించకపోవడంతోనే కుక్కలు పిల్లలకు జన్మదిస్తూ అధికమవుతున్నాయని అన్నారు. ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు సక్రమంగా తీసుకోకపోవడం వల్ల ఎదురయ్యే సమస్యను కుక్కలను చంపడంతో పరిష్కరిద్దాం అనుకోవడం మంచిది కాదని సూచించారు.

ప్రభుత్వాలైనా, వ్యక్తులైన అన్యాయంగా శునకాలను హత్య చేసే కార్యక్రమాలకు తక్షణమే ముగింపు పలకాలని డిమాండ్ చేశారు.

# స్విస్ తో వాణిజ్య సంబంధాల బలోపేతానికి సహకరించండి



## ఏపీలో పెట్టుబడులకు స్విస్ కంపెనీలను ప్రోత్సహించండి

## స్విస్ లో భారత రాయబారి మృదుల్ కుమార్ తో మంత్రి లోకేష్ భేటీ

జ్యూరిచ్ (స్విట్జర్లాండ్): స్విట్జర్లాండ్ లో భారత రాయబారి మృదుల్ కుమార్ తో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... స్విట్జర్లాండ్ తో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఆసక్తిగా ఉందని చెప్పారు. ఇందుకోసం స్విస్ కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. టెక్నాలజీ, టెక్స్ టైల్, యంత్రాల తయారీ, హార్డ్ వేర్, ఎలక్ట్రానిక్స్, రైలు, రైలు విడిభాగాల తయారీ, ఫార్మాస్యూటికల్స్, ఆర్ అండ్ డి సెంటర్స్, విశ్వవిద్యాలయాలతో సహకారం వంటి రంగాల్లో మేం స్విస్ సహకారాన్ని కోరుకుంటున్నాం. నెస్లే, రోచె, నోవార్టిస్, ఎబీబీ, లైబెర్ ఇంజనీరింగ్, క్లారియంట్, హిల్టి, బుహ్లర్, బుచర్, ఫెర్రింగ్ ఫార్మాస్యూటికల్స్, ఎస్ టీ టెలిమీడియా, ఓసీ ఓర్లికాన్ వంటి కంపెనీలు తమ యూనిట్లను ఏపీలో నెలకొల్పేలా ప్రోత్సహించండి. స్విస్ లోని జ్యూరిచ్ విశ్వవిద్యాలయం, బాసెల్ యూనివర్సిటీ, బెర్న్ యూనివర్సిటీ, జెనీవా విశ్వవిద్యాలయం వంటి ప్రఖ్యాత వర్సిటీలను ఏఐ, ఫార్మా, మెడికల్ డివైస్, స్టార్టప్, ఎక్స్చేంజి ప్రోగ్రామ్ లపై ఏపీ వర్సిటీలను అనుసంధానించడంలో మద్దతు ఇవ్వండి. ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న తెలుగు డయాస్పోరా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దోహదపడుతోంది. స్విట్జర్లాండ్‌లో భారతదేశ సాంకేతిక ప్రతిభకు భారీ డిమాండ్ ఉంది. ఆంధ్రప్రదేశ్ నుంచి మరింత మంది సాంకేతిక నిపుణులను స్విట్జర్లాండ్ కు పంపడానికి సహకారం అందించండి. తెలుగు డయాస్పోరాకు చెందిన ఔత్సాహికులను ఎంటర్ ప్రెన్యూర్స్ గా తయారు చేయడంపై ఆంధ్రప్రదేశ్ ఆసక్తిగా ఉంది. దీనివల్ల దేశాభివృద్ధికి అవకాశమేర్పడుతుంది. ఇందుకు మీవంతు సహకారం అందించండి. గతంలో చాలామంది విద్యావంతులు యూఎస్ వెళ్లి అక్కడ వివిధరంగాల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం యూరప్ కు కూడా విద్యార్థులు పెద్దఎత్తున వస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి స్విట్జర్లాండ్ కు వచ్చే విద్యార్థులకు అవసరమైన సహాయ, సహకారాలు అందించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.దీనిపై స్విస్ లోని భారత రాయబారి మృదుల్ కుమార్ స్పందిస్తూ... గత ఏడాది అక్టోబర్ 1న భారత్, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (స్విట్జర్లాండ్, నార్వే, ఐస్ ల్యాండ్, లీచెన్ స్టెయిన్)ల మధ్య జరిగిన చరిత్రాత్మక ట్రేడ్ అండ్ ఎకనమిక్ పార్టనర్ షిప్ అగ్రిమెంట్ (ుఇఖం)తో ఇరు ప్రాంతాల నడుమ వాణిజ్య సంబంధాలు నవశకంలోకి ప్రవేశించాయి. ఈ ఒప్పందం ప్రకారం రాబోయే 15ఏళ్లలో భారత్ లో విబిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టడానికి యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ దేశాలు తమ కమిట్ మెంట్ ను వ్యక్తంచేశాయి. భారత్ లో 10లక్షల మంది యువతకు ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పించడమే ఈ ఒప్పందం లక్ష్యమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చొరవకు తమవంతు సహకారం అందిస్తానని మృదుల్ కుమార్ పేర్కొన్నారు.

# మేడారంలోనీ హరిత హొటల్లో సమావేశం.

## ముఖ్యమంత్రి గారి మేడారం పర్యటన విజయవంతం : మంత్రి సీతక్క




**ప్రజాబలం ములుగు జిల్లా ప్రతినిధి జనవరి 19 :** సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి గారి పర్యటనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు గద్దెల ప్రాంగణ ప్రారంభంతో ఒక కట్ట ముగిసింది ఈ బుధవారం నాడు మండే మెలిగే పండుగ ఉంది మండే మెలిగే పండుగ నుంచి నిండు పండగ వరకు ఇదే రకంగా విజయవంతం చేయాలితల్లుల కీర్తిని ప్రపంచానికి చాటేలా కవరేజ్ చేసిన మీడియా సోదరులందరికీ ధన్యవాదాలు మేడారంలో క్యాబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేసి విజయవంతం చేసిన అధికారులందరికీ అభినందనలు హైదరాబాదులో జరిగే క్యాబినెట్ సమావేశాన్ని అడవిలోకి తీసుకొచ్చి ఏర్పాట్లు చేశాము కేవలం క్యాబినెట్ సమావేశమే కాదు రాత్రి సీఎంగారి కుటుంబం, మంత్రుల కుటుంబాలు ఇక్కడ బసచేశాయి రెండు రోజులపాటు ఇక్కడ యావత్ క్యాబినెట్ ఉండడం, క్యాబినెట్ సమావేశాన్ని ఇక్కడే ఏర్పాటు చేసి పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను ప్రకటించడం ములుగుకు గర్వకారణం క్యాబినెట్ సమావేశాన్ని సక్సెస్ చేసిన అధికార యంత్రంగా అందరికీ అభినందనలు అటెండర్ నుంచి చీఫ్ సెక్రటరీ వరకు, ఐగార్డుల నుండి డీజేపి వరకు.. కష్టపడి పనిచేసి క్యాబినెట్ సమావేశాన్ని, సీఎం పర్యటనను విజయవంతం చేసిన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు నిన్న క్యాబినెట్ సమావేశం, నేడు గద్దెల ప్రాంగణ ప్రారంభోత్సవం, సీఎం మంత్రుల దర్శనాల సందర్భంగా ఎక్కడ ఎలాంటి చిన్న లోపల లేకుండా విజయవంతం చేసిన జిల్లా అధికార యంత్రాంగానికి అభినందనలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివచ్చి సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళలందరికీ కృతజ్ఞతలుసమ్మక్క సారలమ్మ కీర్తి స్ఫూర్తి నీ నింపుకొని మహిళలు ఎన్నో విజయాలు సాధించేందుకు సీఎంతో పాటుగా పెద్ద ఎత్తున మహిళలకు దర్శనాలు. చేయించాము

## మేడారంలో బహిరంగ సభలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మేడారంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





**.ప్రజా బలం ములుగు జిల్లా ప్రతినిధి జనవరి 19 :** చరిత్రలో హైదరాబాద్ బయట మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసుకున్న దాఖలలు లేవు. ధీరత్వమే దైవత్వంగా మారిన చారిత్రక సత్యం మేడారం మ త్సవం. గుడి లేని తల్లులను గుండె నిండా కొలుచుకునే తెలంగాణ అతిపెద్ద గిరిజన జాతర ఇది. కాకతీయుల కత్తికి ఎదురు నిలిచిన ధీరవనితలు సమ్మక్క-సారలమ్మలు. దక్షిణాది కుంభమేళా మేడారం జాతర. ఆనాడు ఫిబ్రవరి 6, 2023 న ప్రజా కంటక పాలనను గద్దె దించాలని ఇక్కడి నుంచే పాదయాత్ర ప్రారంభించా, తల్లుల ఆశీర్వాదంతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.మేడారం అభివృద్ధి చేయడం నా అదృష్టంగా భావిస్తున్నా, వంద రోజుల్లో రాతి కట్టడాలతో తల్లుల ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించా.జాతర నాటికి మేడారం అభివృద్ధి పనులు పూర్తి చేశాం. ఇది నాకు అరుదైన అవకాశం.జీవితంలో ఏం చేశామని వెనక్కితిరిగి చూసుకుంటే గిరిజనుల కోసం సమ్మక్క సారలమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేశామని గర్వంగా చెప్పుకుంటా. మేడారం అభివృద్ధి చేసి ఫిబ్రవరి 6, 2023 మేము మొక్కుకున్న మొక్కు తీర్చుకున్నాం.మేడారం జంపన్న వాగులో నిరంతరం నీరు పారిస్తాం.రామప్ప, లక్నవరం నుంచి జంపన్న వాగుకు నీరు తరలిస్తాం.ఈరోజు సమ్మక్క- సారక్క ఆలయాన్ని ప్రారంభించుకుని భక్తులకు అంకితం చేస్తున్నాం. మేడారం జాతరను కుంభమేళా స్థాయిలో ఘనంగా నిర్వహిస్తాం

## మేడారంలో రాష్ట్ర మంత్రివర్గం క్యాబినెట్ మీటింగ్ తీసుకున్న నిర్ణయాలు.

1. వీలైనంత తొందరగా మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.రాష్ట్రంలో పదవీ కాలం ముగిసిన 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో 2996 వార్డులు, డివిజన్లలో ఎన్నికలు జరపాల్సి ఉంది. డెడికేటెడ్ కమిషన్ నివేదిక ప్రకారం రిజర్వేషన్ల ప్రక్రియ కూడా పూర్తి అయింది.అందుకే ఫిబ్రవరిలోనే మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది.ఫిబ్రవరిలో రంజాన్, శివరాత్రి పండుగలు ఉన్నందున ఎన్నికల ప్రక్రియకు ఇబ్బంది లేకుండా ఎన్నికల షెడ్యూల్ రూపొందించుకోవాలని కేబినెట్ అధికారులకు సూచించింది. 2. 2027 జూలై 27 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాలు ఘనంగా జరిపించాలని చర్చించింది.బాసర నుంచి భద్రాచలం వరకు రాష్ట్రంలో గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న అన్ని ప్రధాన ఆలయాలు, పురాతన ఆలయాల అభివృద్ధి, ఎకో టూరిజం అభివృద్ధి చేసేందుకు త్వరలో కేబినెట్ సబ్ వేయాలని నిర్ణయం తీసుకుంది.బాసర నుంచి భద్రాచలం వరకు ఒక సర్క్యూట్ ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయం దేవాదాయ, రెవెన్యూ, అటవీ, పర్యాటక, పురాతత్వ శాఖల సంయుక్తంగా డీటేయిల్ రిపోర్ట్ తయారు చేయాలని అధికారులకు ఆదేశం మార్చి 31 నాటికి ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించాలని ఆదేశించిన సీఎం3. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-I ప్రాజెక్ట్ ను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునేందుకు సంబంధించి ఇంతవరకు జరిగిన పురోగతిని కేబినెట్ సమీక్షించింది. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయం తీసుకుంది.మెట్రో ఫేజ్-××యాలోని నాలుగు కారిడార్లు, ఫేజ్-IIదీలోని మూడు కారిడార్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పెండింగ్ లో ఉన్నాయి. ఈలోపు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రూ.2,787 కోట్ల అంచనా వ్యయమయ్యే భూ సేకరణ ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది.4. నల్గొండ జిల్లా మహాత్మాగాంధీ యూనివర్సిటీ లా కాలేజీలో 24 కొత్త పోస్టులు, ఫార్మసీ కాలేజీలో 28 కొత్త పోస్టులు మంజూరుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ లో రిజిస్ట్రార్ పోస్టుకు ఆమోదం తెలిపింది.5. హైదరాబాద్ సమీపంలోని అబ్దుల్లాపూర్ మండలంలో ఎకో టౌన్ డెవలప్మెంట్ కు TGIIC కి 494 ఎకరాల భూమిని కేటాయించేందుకు కేబినెట్ అనుమతి ఇచ్చింది.6. హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు బంజారా హిల్స్ లోని ICCC నుంచి శిల్పా లే అవుట్ రోడ్డు వరకు కొత్తగా 9 కి.మీ. కొత్త రోడ్డు నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.7. ములుగు జిల్లాలో కొత్తగా పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను కేబినెట్ ఆమోదించింది. రామప్ప చెర్వు నుంచి నీటిని లిఫ్ట్ చేసి ములుగు జిల్లాలోని 5 గ్రామాలు, 30 చెర్వులు కుంటలను నింపడంతో పాటు.. 7500 ఎకరాల ఆయకట్టు కు నీటిని అందించనుంది. రూ.143 కోట్ల అంచనా వ్యయంతో ఈ స్కీం చేపట్టనుంది.



# రహదారి భద్రత పై వ్యాస రచన పోటీల నిర్వహణ.

## వేములవాడ రూరల్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహణ

## విజేతలకు బహుమతుల ప్రధానం.

## వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** ఆ రైవ్ ఆ లైవ్ అనే థీమ్ తో రోడ్డు భద్రత పై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం. షెడ్యూల్లో భాగంగా రోడ్డు భద్రతకు సంబంధించిన విషయాలపై వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసులచే వ్యాసరచన మరియు డ్రాయింగ్ పరీక్షలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రధాన చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై వెంకట్రాజం మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి పౌరుని బాధ్యతగా తీసుకొని ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగిసి, ప్రతి వ్యక్తి క్షేమంగా ఇంటికి చేరాలని సందేశాన్ని ఈ థీమ్ స్పష్టంగా తెలియజేస్తుందని, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ లేదా సీటు బెల్టు ధరించకపోవడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి కారణాలవల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. వీటి నివారణకు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం అత్యవసరం. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూకలమర్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బూర సదానందం, ఉపాధ్యాయులు, విద్యార్థిని ,విద్యార్థులు, పోలీస్ సిబ్బంది రాజశేఖర్ పోలీస్ సిబ్బంది రాజశేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# వడ్డీ లేని రుణాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

## మంత్రి మల్లు బట్టి విక్రమార్క



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 19 :** మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక పథకాల ద్వారా చేయూత అందించడం జరుగుతుందని,ఈ క్రమంలో వడ్డీ లేని రుణాల పథకంలో భాగంగా పట్టణ మహిళా సంఘాల సభ్యులకు రుణాలు,ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక,ప్రణాళికా శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క అన్నారు. సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు,సెర్ప్ సి ఈ ఓ దివ్య దేవరాజన్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు,మెప్మా అధికారులు,బ్యాంకు అధికారులతో వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ పట్టణ మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, అర్హులైన స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.మహిళ సంఘాలలో సభ్యులుగా లేని వారిని రేషన్ కార్డు ఆధారంగా గుర్తించాలని, పంపిణీ కార్యక్రమంలో రద్దీ లేకుండా చూడాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు వడ్డీ లేని రుణాలు,ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియ చేపడతామని, అధికారుల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మున్సిపల్ కమిషనర్లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పరిపాలన సాగించాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 19 :** గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు పరిపాలన సాగించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్లా లో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో నూతన సర్పంచ్ లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు,జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తూ పంచాయత వ్యవస్థను మరింత సమర్ధవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు.గ్రామస్థాయిలో ప్రజల ఆశయాలను నెరవేర్చే బాధ్యత సర్పంచ్ లదే అని,ప్రభుత్వ పథకాలు,ఆర్థిక వ్యవస్థ, పాలన విధానాలు,నిబంధనలు,నిర్వహణ అంశాలలో పూర్తి పరిజ్ఞానం కలిగి ఉండడం అవసరమని తెలిపారు. శిక్షణలో గ్రామ పంచాయతీ విధులు,అధికారాలు,గ్రామ అభివృద్ధి ప్రణాళిక తయారీ విధానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు-అమలు విధానం,ఆర్థిక నిర్వహణ, బడ్జెట్ తయారీ,ఖాతాల నిర్వహణ,గ్రామ పంచాయతీ రికార్డులు,రిజిస్టర్లు, డిజిటల్ సర్వీసులు,ప్రజాసేవలో పారదర్శకత,బాధ్య,మహిళా సాధికారత,సామాజిక న్యాయం, సమానత్వం,స్వచ్ఛ భారత్, హరిత హారం,పరిశుభ్రత కార్యక్రమాలు,ప్రజలతో సంబంధాలు-వినతులు, ఫిర్యాదుల పరిష్కారం, గ్రామస్థాయిలో నాయకత్వ లక్షణాలు వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామస్థాయిలో పరిపాలన సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన నైపుణ్యం, జ్ఞానం అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ పాలనలో నూతన దృక్పథంతో ముందుకు సాగేందుకు శిక్షణ తోడ్పడుతుందని,సంబంధిత మండలాలకు చెందిన సర్పంచ్ లు నిర్ణీత తేదీ, సమయం, స్థలం లో తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమం గ్రామాభివృద్ధికి అత్యంత కీలకమైనదని,శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్,చెన్నూర్,హాజీపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మోహన్,సాయి వెంకట రెడ్డి,మండల పంచాయతీ అధికారులు శ్రీపతి బాపురావు, అనిల్, శ్రీనివాస్,పి.వెంకటేష్, మహేష్, పంచాయితీ కార్యదర్శులు,డి.పి.ఎం. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందజేసిన ప్రణవ్



**హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జనవరి 19**మహిళల చుట్టే కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయని వారు ఆర్థికంగా పరిపుష్ఠితి చెందుతేనే కుటుంబం తద్వారా రాష్ట్రం బాగుంటుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ అన్నారు.సోమవారం రోజున హుజురాబాద్ పట్టణంలో ఇందిరా మహిళా శక్తి సంఘం,పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.గత రెండు సంవత్సరాలకు గాను 73,93,823/- రూపాయల చెక్కులు 553 మహిళా సంఘాల బీపీఎల్ కుటుంబాలకు మెప్మా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని దాంట్లో భాగంగానే ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోపే మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు సౌకర్యాన్ని అందజేశామని ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కలను నెరవేరుస్తున్నామని,పదేళ్ల నిరీక్షణ తర్వాత రేషన్ కార్డులు అందజేశామని,ప్రతి పేదవాడికి కడుపునిండా సన్న బియ్యం అందజేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వమని ప్రజా ప్రభుత్వమని అన్నారు.రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమల్లోకి తీసుకువస్తామని త్వరలోనే హుజురాబాద్ లో డబుల్ బెడ్ రూంలను పంచుతామని,పేదల ప్రభుత్వమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ పట్టణ కమిషనర్ సమ్మయ్య మున్సిపల్ అధికారులు,మెప్మా అధికారులు, హుజురాబాద్ పట్టణ టౌన్ అధ్యక్షుడు మేకల తిరుపతి,మహిళా అధ్యక్షురాలు వేముల పుష్పలత,కాంగ్రెస్ నాయకులు,మైనారిటీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# గుర్తించిన చెరువులు, రిజర్వాయర్ల అభివృద్ధికి చర్యలు

## అటవీ శాఖతో కలిసి కార్యాచర ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జనవరి - 19 (ప్రజాబలం ప్రతినిధి)**జిల్లాలో గుర్తించిన చెరువులు, రిజర్వాయర్ల (వెట్ల్యాండ్స్) సంరక్షణ, అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఈ సందర్భంగా అటవీ శాఖ, నీటి పారుదల, సంబంధిత అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. చెరువులు, రిజర్వాయర్ల (వెట్ల్యాండ్స్)సహజంగా నీరు నిల్వ ఉండే తడిసిన భూములు ప్రకృతి సమతుల్యతకు కీలకమని, ఇవి భూగర్భ జలాల పెరుగుదలకు, పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. పలు వెట్ల్యాండ్స్ను గుర్తించి మ్యాపింగ్ చేసి, వాటి అభివృద్ధి కోసం అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఎంపిక అయిన జలవనరులను అభివృద్ధి, మరమ్మత్తు పనులను చేస్తారని పేర్కొన్నారు. దీంతో పక్షులు, జంతువులకు ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే పర్యాటక రంగం అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి బాలమణి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ గీత, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్, ఈఈలు సంతు ప్రకాశ్, ప్రశాంత్, డీఈలు, ఏఈలు, ఎఫ్ఆర్ఓ కల్పన తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలిజిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జనవరి 19:**ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ అధికారులను ఆదేశించారు.

సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి డిఆర్ఓ (67) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని డిఆర్ఓ అన్నారు. వివిధ శాఖలకు సంబంధించి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తులు ఎక్కువగా పెండింగ్ ఉన్న శాఖల వారు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు డిఆర్ఓ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను పట్టించుకొని అధికారులు




**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 19 జనవరి 2026**భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు తలపెట్టిన మీ సమస్య - మా బాధ్యత, ప్రజలతో - ప్రజలకోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున నార్సింగి రోడ్డు గీతాంజలి వేదిక, స్వస్తిక్ నగర్ పరిసర ప్రాంతాలు పర్యటించి స్థానికులను కలువడం జరిగినది. ఈ సందర్భముగా ప్రజలు మార్పు కోరుతూ తమ పిల్లలకు నాణ్యమైన విద్యా, ఇంటి పిల్లా పాప, వయోజనులకు కార్పొరేట్ వైద్యం ఉచితముగా అందించాలని కోరడం జరిగినదని స్థానిక పార్టీ అధ్యక్షుడు సీతారం ధూళిపాళ తెలియ పరచారు. పొట్ట కూటి కొరకై కొంత మంది నవయువకులు ఇంటికి కిరాణా తదితర వస్తువులు చేర్చడానికి ఏర్పాటు కాబడ్డ సరఫరా సంస్థలో పని చేస్తు ఉండడం వలన చాలా చోట్ల ఐదు అంతస్తుల కాంప్లెక్ పెద్దలు కనికరం చూపకుండా లిఫ్ట్ ఉపయోగించ వద్దని కట్టడి చేయడం మూలాన వారు ఎంతో శ్రమ కోర్చి వస్తువులను మోస్తూ మెట్ల మార్గాన వెళ్లవలసి వస్తున్నదని, అందుకు గాను ఆ నవయువకుల తల్లి తండ్రులు తమ వ్యధను వెల్లడి చేస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుకోవడం జరిగినది. అందుకు బిన్నంగా ప్రస్తుత తరుణంలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని గద్దెనెక్కిన ప్రభుత్వం కళ్లబొల్లి మాటలతో పబ్బం గడుపుతూ ముందుకు సాగుతున్నారని, తమకు కనీసం రేషన్ కార్డులు కూడా ఇవ్వడం లేదని తెలియ జేసినారు. ఒక వయోజన వ్యక్తి తాను పంచాయతీ సమితి ఉన్న సమయములో కట్టుకున్న 225 గజాల పెంకుటిల్లుకు ఇప్పుడు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జతపరచలేదని సాకు చెబుతూ సంబంధిత జల మండలి అధికారులు నీటి సరఫరాకు మూడు రెట్లు పెనాలిటీ వసూలు చేస్తున్నారని మొర పెట్టుకొన్నారు, సంబందిత విషయాలు తెలియ పరుస్తూ గతములోనే జలమండలి పై అధికారులకు తెలిపినము ఖాతరు చేయకుండా ఇట్టి తరహా వసూళ్లు కొనసాగిస్తున్నారని కావున ఇట్టి చర్యలతో ప్రజలను ఇబ్బంది పెట్టడం మానుకోవాలని హితవు చెబుతూ, లేనియెడల ప్రజల మద్దతుతో పెద్ద సంఖ్యలో గెరవుచేస్తామని బి.ఆర్.ఎస్ నాయకులు హెచ్చరించడం జరిగినది. ఇట్టి పాదయాత్రలో కుంభగల్ల ధనరాజ్, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, యాలాల కిరణ్, షేక్ ఆరిఫ్, సుమనళిని, జై రామ్, శేఖర్ తది తరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ బరిలో శేరి సునీత జగన్మోహన్ రెడ్డి మంత్రి దామోదర రాజనర్సింహ ఆశీస్సులు మాపైనే



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 19 (ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా:** అందోల్- జోగిపేట మున్సిపల్ పరిధిలో వార్డుల వారిగా రిజర్వేషన్ రావడంతో, మున్సిపల్ ఎన్నికల వేడి మొదలైంది, ప్రజల సేవ చేయడానికి ముందుకు వస్తున్న, మాజీ జెడ్పిటిసి, శేరి సునీత జగన్మోహన్ రెడ్డి, ఎన్నికల్లో పోటీ చేసే మహిళ, ఒక ధైర్యవంతమైన ప్రజా సేవకురాలిగా, పేరు పొందుతారు, సమాజంలోని ప్రజల సమస్యలను, దగ్గరగా గమనించి, ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలనె సంకల్పంతో, జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో, చైర్మన్ పదవికి సిద్ధంగా ఉన్నానని,శేరి సునీత జగన్మోహన్ రెడ్డి అన్నారు, ఇప్పటివరకు అందోల్- జోగిపేట, మున్సిపల్ చైర్మన్ పదవిని, ఇప్పటికి రెండుసార్లు, జోగిపేటకే అంకితమైందని, ఈసారైనా ఆందోల్ కి, మున్సిపల్ చైర్మన్ పదవి దక్కాలని, ఆందోల్ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు, ఇప్పటికీ ఎప్పటికీ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఆశీస్సులు సునీత జగన్మోహన్ రెడ్డి పై ఉంటాయని, ఆందోల్ ప్రజలు కోరుకుంటున్నారు, ఈసారైనా మున్సిపల్ చైర్మన్ పదవి, ఆందోల్ కే దక్కాలని ఆందోల్ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు...

## హింద్ ది చాదర్ శ్రీ గురుదేవ్ బహదూర్ సాహెబ్ జి 350 వ షాహిది శాంతిది సమాగం ప్రచారం






**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 19 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :**జోగిపేట, 20వ వార్డులో సిక్కుల యొక్క తొమ్మిదవ గురువు శ్రీ గురుదేవ్ బహదూర్ సాహెబ్ జి, 350వ,షాహిది శాంతి సమాగం ప్రచారం గురించి, తెలంగాణ సిక్కు సికిలిగర్ అసోసియేషన్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలాని ఆనంద్ సింగ్, ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా లో ఉన్నటువంటి సిక్కుల సమాజం,ఊరూరా తిరిగి మండలాల వారీగా సిక్కు సోదరులకు హేంద్ -ది -చాదర్ శ్రీ గురుదేవ్ బహదూర్ సాహెబ్ జి, 24,25,01-2026వ తేదీ జరగొబోయే హేజూర్ సాహిబ్,నాందేడ్ లో నిర్వహిస్తున్నటువంటి కార్యక్రమం గురించి జాగృతి చేస్తూ, అందరికి పంప్లెట్, గురుదేవ్ బహదూర్ మహారాజ్, సిల్వర్ సింబల్, ఫోటో ఇస్తూ, మహారాష్ట్ర చేసుకుంటూ తెలంగాణ లో రాష్ట్రమంతా తిరుగుకుతూ జోగిపేట కు వచ్చి సిక్కు సోదరులతో కలసి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సిక్కుల సంఘం కమిటీ జగన్ సింగ్, గ్యాన్ సింగ్,( పోట్ల సింగ్ ), వీరు ఈ జిల్లాకు సంబంధించిన సిక్కు సోదరుల గురించి తెగ సింగ్, ను పిలిపించి, సంగారెడ్డి సికిలిగర్ సంఘం అధ్యక్షులు దరియావ్ సింగ్, ఉపాధ్యక్షులు హరిజిత్ సింగ్, కమిటీ సభ్యులు బల్మత్ సింగ్, పవన్ సింగ్ లకు, మహారాష్ట్రలో సర్దార్ జిల అతి పెద్ద పవిత్రమైన సచ్ ఖండ్ శ్రీ హజూర్ సాహెబ్, గురుద్వారాలో జరిగే కార్యక్రమంలో అందరూ హాజరు కాగలరని కోరుకున్నారు....

# జిపిఎస్ ట్రాకర్ సిస్టంతో రాబందు కలకలం





**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 19 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** అల్లాదుర్గం మండల పరిధిలోని, బైరాన్ దిబ్బ, గ్రామంలో రాబందు పక్షిని చూసి భయాందోళనకు గురైన స్థానికులు, రాబందు, కాళ్లకు నెంబర్ తో కూడిన స్టిక్కర్స్, ఉండడంతో, జరగరానిది ఏదైనా గ్రామానికి జరుగుతుందనె భయంతో, గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు, ఫారెస్ట్ రేంజ్ అధికారి వికాస్,ను వివరణ కోరగా, దేశంలో రాబందులు అంతరించిపోవడంతో వాటిని కాపాడేందుకు, మహారాష్ట్ర ప్రభుత్వం, (జిపిఎస్) ను వాటి కాళ్లకు కట్టి, ట్యాగ్స్ అతికించి, వాటిని వదిలేసారని, రాబందులు దేశంలో ఎక్కడెక్కడ తిరిగినా వాటి లొకేషన్ ను మహారాష్ట్ర ప్రభుత్వం ట్రేస్ చేస్తుందని, వాటికి ఎవరైనా హాని తల పెడితే, మహారాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందుతుందని తెలిపారు, రాబందులకు ఎవరైనా హాని తల పెడితే, వారికే కఠిన చర్యలు ఉంటాయని, ఫారెస్ట్ రేంజ్ అధికారి వికాస్, వెల్లడించారు

## మృతుని కుటుంబానికి బి ఆర్ ఎస్ పార్టీ మర్పల్లి మండల అధ్యక్షులు రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి ఆర్థిక సహాయం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జనవరి 19(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ తండా గ్రామానికి చెందిన నారాయణ రాథోడ్ఆకస్మికంగా మరణించడం జరిగిందిఇట్టి విషయం బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న టిఆర్ఎస్ పార్టీ మర్పల్లి మండల అధ్యక్షులు రావులపల్లి ×శ్రీకాంత్ రెడ్డివారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు మృతుని కుటుంబానికి 5000/- రూపాయలుఆర్థిక సహాయం పంపడం మాజీ సర్పంచ్ ఇందిర అశోక్,మరియు టిఆర్ఎస్ పార్టీ నాయకులు సునీల్ ప్రభు రమేష్,మృత్యుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు ఈకార్యక్రమ లో రమేష్, నారాయణ ,రవి , ప్రభు, ప్రకాష్ ,చందర్, భీమ్ రావు ,తదితరులు పాల్గొన్నారు



## వికారాబాద్,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ను,కలసిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గౌసోద్దీన్


**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 19 (ప్రజాబలం)** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం పంచలింగాల్ మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనా గారి కొండల్ రెడ్డి స్వగ్రామంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గౌసో ద్దీన్ కలిశారు కలిసి వారి తండ్రిగారి ఆత్మ కి ఓం శాంతి అంటూ చెప్పి పలకరించి వారు చేసిన విందులో పాల్గొని రావడం జరిగిందని మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గౌసో ద్దీన్ తెలిపారు

## ఎన్పీడీసీఎల్ సిఎండి కి వినతి పత్రము ఇచ్చిన TG TGUEEU-CITU రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్తమాల ప్రసాద్ జిల్లా కార్యదర్శి కామినేని నాగేశ్వరరావు



**ఖమ్మం ప్రతినిధి జనవరి 19 (ప్రజాబలం)** ఖమ్మం విద్యుత్ శాఖలో కార్మికులు ఉద్యోగులు పీసు రేటు ఆర్టిజన్ అన్ మేన్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ వినతిపత్రం ద్వారా తెలియపరిచినారు ట్రాన్స్ఫర్ల ఇప్పుడు చేయరాదని మే జూన్ ల లో చేయాలని ట్రాన్స్ఫర్లు ఆర్టీజన్ల కు కూడా అమలు చేయాలని కోరడం జరిగింది ఒక్కొక్క సమస్య పరిష్కారం చేయటం జరుగుతుంది అని సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి హామీ ఇచ్చినారు ఈ కార్యక్రమంలో ఉద్యోగులు సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కునీ రద్దు చేయొద్దు



Bharatha Rashtra Samithi
Manikonda Muncipality, Gandipet Mandal, R.R. District
Plot no: J4, Road no.5 C/E, Panchavati colony, Manikonda - 500089

Dated the 19th Jan 2026
To
The Chief Electoral Officer and
Secretary to Govt,Telangana State,
9th Floor, B.R.K.R.Building,
Hyderabad.

Dear Sir,

Sub:- Due process in preparation of Electoral Rolls not being followed in the erstwhile Manikonda Municipality and the present Ward No.127 Manikonda and Ward No.128 Neknampur under GHMC – Request to cause inquiry and to set right the system – Reg.

...

The Right to Vote is a Constitutional Right guaranteed under Article 326 of the Constitution of India. Its effective exercise depends on the faithful implementation of RPA 1950 (preparation of electoral rolls) and RPA 1951 (conduct of elections). Free & fair elections are impossible without transparent, accountable and lawful electoral roll management.

In practice, the existing system has degenerated into a MOCKERY OF DEMOCRACY. In the present Narsingi GHMC circle (erstwhile Manikonda Municipality), BLOs under Dy. Commissioner, Narsingi Circle, and GHMC are completely sidelined from electoral roll preparation. Their official online credentials are allegedly being accessed and operated by unauthorized agents positioned in AERO/MRO offices, a process wholly alien to the constitutional and statutory scheme.

**Alarming reality:** ***Online Voter ID applications are being rejected without mandatory field verification. When citizens approach the concerned BLOs, they themselves are unaware of such rejections, clearly indicating that decisions affecting the constitutional right to vote are being taken remotely by unauthorized persons. This amounts to systematic voter disenfranchisement and a grave mockery of democratic governance.***

Even after 78 years of Independence, India still lacks an independent, professionally staffed ECI field cadre. BLOs, AEROs and EROs and especially BLOs must be qualified, institutionally independent, directly accountable to Election Commission of India and the Chief Electoral Officer, Telangana, and accessible to citizens during working hours. Outsourcing or remote control of these statutory functions is impermissible in law.

19 JAN 2026

**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 19 జనవరి 2026**భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కనీ, అందుకు ఓటర్ల జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా, విశ్వసనీయతతో, జవాబుదారీగా, చట్టబద్ధముగా జరగాలని అందుకు భిన్నంగా ప్రజా స్వామ్య వ్యవస్థ అపహాస్యం చేసే దిశగా దిగ జారిపోయిందనీ బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు తెలియ పరుస్తున్నారు. ప్రస్తుత నార్సింగ్గి మునిసిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆధీనములోనీ బూత్ లెవెల్ ఆఫీసర్ లు చేపట్ట వలసిన ఓటర్ల జాబితా తయారీ అధికారిక ఆన్లైన్ ఆధారాలను మండల రెవెన్యూ అధికారీ ఆజమహిషిలో అనధికార ఏజెంట్లు యాక్సెస్ చేసి నిర్వహిస్తున్నారని తెలియడమైనదని, ఇట్టి నిర్వహణ చట్టబద్ధమైన పథకానికి పూర్తిగా విరుద్ధమైన ప్రక్రియ మరియు ఆన్లైన్ ఓటర్ దరఖాస్తులను ఫీల్డ్ వెరిఫికేషన్ లేకుండా తిరస్కరించ బడుతున్నాయనీ, ప్రతిచర్యగా పౌరులు సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్ లను సంప్రదించి నప్పుడు, వారికి అలాంటి తిరస్కరణల గురించి ఏమి తెలియదని చెప్పడం వింతగా ఉన్నదని



స్థానికులు మండి పడుతున్నారు. రాజ్యాంగ ఓటు హక్కును అనధికార వ్యక్తులు రిమోట్‌గా తీసుకుని ఓటర్లను తొలగించడం ప్రజాస్వామ్య పాలనను తీవ్రంగా అపహాస్యం చేయడమేనని, భారతదేశం స్వాతంత్రం వచ్చిన 78 సంవత్సరాల తర్వాత కూడా చట్టబద్ధమైన విధులను అవుట్ సోర్సింగ్ లేదా రిమోట్ కంట్రోల్ ద్వారా నిర్వహించడం చట్టం అనుమతించ బడకున్నను స్వతంత్ర, వృత్తిపర సిబ్బందితో కూడిన ఫీల్డ్ కేడర్ లేదనీ అందుకు సంస్థాగతంగా భారత ఎన్నికల కమిషన్, తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారులు జవాబు దారీగా ఉండాలనీ బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పూర్వపు మణికొండ మునిసిపాలిటీ, ప్రస్తుత వార్డ్ 127 మణికొండ మరియు వార్డ్ 128 నెక్నాంపూర్‌లలో ఓటర్ల జాబితా తయారీలో తగిన ప్రక్రియ పాటించ బడటం లేదని రిమోట్-కంట్రోల్డ్ అనధికార ఏజెంట్లు యాక్సెస్ చేసి నిర్వహిస్తున్నారని, అట్టి వ్యవస్థను కూల్చి వేయడం రాజ్యాంగ పరంగా తక్షణ అవసరం అని ఇది విఫలమైతే ప్రజాస్వామ్య ప్రక్రియ కూడా రాజీ పడుతుందనీ పరిహార దిశగా న్యాయ విచారణ జరపాలని మరియు వ్యవస్థను సరిదిద్దాలని తెలియ పరుస్తూ సంబంధిత తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ కు భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, షేక్ ఆరిఫ్, సుమనళిని, జై రామ్, బొడ్డు శ్రీధర్, నూకల బిందు, దేవి ప్రియ, రఫీక్ వినతి పత్రం అందిస్తూ అభ్యర్థించడం జరిగినది.

# పట్లూరు గ్రామంలో నేచరల్ పాల కేంద్రం ప్రారంభించిన మాజీ జెడ్పిటిసి మధుకర్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జనవరి 19(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామంలో జంషద్ పూర్, బి ఆర్ ఎస్,నాయకులు. ఉప సర్పంచ్ ప్రభు తను స్వంత డైరీ ఫామ్ వుంది. కావునమర్పల్లి మండల ప్రజలకు స్వచ్ఛమైన పాల ఉతుపత్తుల వస్తువులు అందించాలని ఏకైక లక్ష్యం తో పాల కేంద్రం ప్రారంభించామని ఈ పాలకేంద్రాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు,ముక్యంగా స్వచ్ఛమైన పాలు, నెయి, పెరుగు, పాల కొవ్వ తదితర పాల ఉత్పత్తి వస్తువులు



లభిస్తాయి అని తెలిపారు,ఈ కార్యక్రమం లో మాజి జడ్పీటీసీ మధు, పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మాజి మోహనరెడ్డి, మాజి సర్పంచ్ ల సంఘము అధ్యక్షులు పడమటి శ్రీనివాస్, పెద్దాపూర్ డైరెక్టర్ యాదయ్య, బి ఆర్ ఎస్ యూత్ అధ్యక్షులు మధు, తుమ్మల పల్లి సర్పంచ్ కర్నె రాజు, పంచాలింగల్ సర్పంచ్ బి మహేందర్, జంషాదపూర్ సర్పంచ్, పట్లూరు మాజి సర్పంచ్ ఇందిర అశోక్, జంషాద్ పూర్ మాజి సర్పంచ్ న్యూరోద్దీన్,ఉప సర్పంచ్ ప్రభు, మాజి ఎంపీటీసీ రవి, అంజయ్య, నాయకులు అశోక్, మాజీ ఉపసర్పంచ్,బషీర్, అలీమ్, నారాయణ, సోషల్ మీడియా వికాస్, బాలేష్, తలారి రాజు, బాలేష్, జాన్, లక్ష్మయ్య, గౌస్, మోహిజ్, లక్ష్మణ్, రాజు, రాచయ్య, గోపాల్ తదితరులు పాల్గొని ప్రారంభించారు.

# జూబ్లీ హిల్స్లో 'లేయర్స్ ఫైవ్' క్లినిక్ ను ప్రారంభించిన మిథాలీ రాజ్

హైదరాబాద్ డైటింగ్ పేరిట ఆహారానికి దూరంగా ఉండటం కంటే, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడాన్నే తాను నమ్ముతానని భారత మహిళా క్రికెట్ మాజీ సారథి మిథా లీరాజ్ అన్నారు. సుప్రసిద్ధ చర్మ, కేశ, సౌందర్య క్లినిక్ బ్రాండ్ అయిన లేయర్స్ క్లినిక్స్, జూబ్లీహిల్స్ లో లేయర్స్ ఫైవ్న క్లినిక్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా తనను కలిసిన క్రీడాభిమానులతో ముచ్చటించారు. ఏ రంగంలో విజయం సాధించాలన్నా క్రమశిక్షణ చాలా ముఖ్యమన్నారు. స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వంటి వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యంగా ఉంటే అది అవసరమైన ఆత్మవి శ్వాసం ఇస్తుందని ఆమె యువతులకు సూచించారు. చర్మ, ఆరోగ్య సంరక్షణలో భాగంగా తాను పాటించే జాగ్రత్తలను మిథాలీరాజ్ వివరించారు.

# బాధితులను పరామర్శించిన మల్లి బాబు యాదవ్



**ఖమ్మం ప్రతినిధి జనవరి 19 (ప్రజాబలం)** రఘునాధపాలెం మండలం రఘునాధపాలెం గ్రామానికి చెందిన పురం గురవయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో సోమవారం జరిగిన దశదినకర్మ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా అక్కడకు చేరిన గొర్రెల పెంపకం దారుల సంఘం సభ్యులు కొంతమంది అడిగిన ప్రశ్నలకు మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ గొర్రెల పెంపకం దారుల సమస్యలు పై ముఖ్యమంత్రి గారిని, మంత్రులని కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగిందని, సమస్యలపై అతి త్వరలో పరిష్కారం దొరుకుతుందని హామీ ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వలన, ప్రభుత్వ బడ్జెట్ లోటు బడ్జెట్ గా ఉన్నప్పటికీ, సమస్యలు ఒక్కొకటిగా పరిష్కారం జరుగుతూ ఉందని, రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలంటే ప్రస్తుత కాలంలో విద్య ఎంతో అవసరమని, అందుకే గొర్రెల వృత్తిని మాత్రమే కాకుండా విద్యకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురవయ్య కుమారులు పురం సీతయ్య పురం అచ్చయ్య, దొంతబోయిన ఉపేందర్, అల్లిక రామకృష్ణ కుర్రి పెద్ద మల్లయ్య, కుర్రి హరీష్, రావు, గాజుల రామారావు, సప్పిడి వెంకటనారాయణ,ఎర్రగడ్డ లింగయ్య, బంధువులు, మరియు తదితరులు పాల్గొన్నారు

# పట్లూర్ జెడ్ పి హెచ్ ఎస్ ,లో సనా గారి చంద్రారెడ్డి, స్మారక దినోత్సవం సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించిన, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనాగారి కొండల్ రెడ్డి





**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జనవరి 19** (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం పట్లూర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో సనా గారి చంద్రారెడ్డి స్మారక దినోత్సవం సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించిన మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టరేట్ అవార్డు గ్రహీత సనా గారి కొండల్ రెడ్డి, వారి తండ్రిగారి పేరుపై అనాథ ఆశ్రమాలకు వృద్ధులకి విద్యార్థులకు నిరుపేదలకి అనేకులకు వారి వంతుగా వారు సహాయం చేస్తూనే ఉంటారు అదేవిధంగా పట్లూర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో వాలీబాల్ టోర్నమెంటు నిర్వహించి మొదటి బహుమతిగా 30 వేల రూపాయలు నగదు ఒక కప్పు రెండవ బహుమతిగా 15000 వెయ్యిలు నగదు ఒక కప్పు మూడో బహుమతిగా 5000 రూపాయలు ఒక కప్పు క్రీడాలో విజయం సాధించిన వారికి బహుమానంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు మర్పల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సురేష్ యాదవ్, పాల్గొన్నారు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ ప్రవీణ్ రెడ్డి, బ్రదర్స్, పాల్గొన్నారు,ఎస్ కె ఆర్ ట్రస్ట్ ద్వారా అనేక సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు వారి నాన్నగారి జ్ఞాపకార్థంగా చక్కటి విందు భోజనాలు ఏర్పాటు చేసి గ్రామస్థాయి నుండి మండల స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు వారి పరిచయస్తులు సుపరిచితులు బంధుమిత్రులు నాయకులు పెద్దలుఅనేకులు పూలు సమర్పిస్తూ ఓం శాంతి అంటూ తెలిపి అనంతరం విందు కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలిపారు

# మహిళలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి



**మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జనవరి 19:**అలియాబాద్ లో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా ఇంద్రమ్మ శ్రీ శక్తి సంఘాల 18506 మంది మహిళలకు ప్రభుత్వ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అలియాబాదులో 5258, ఎంసీ పల్లిలో 6592, ఎల్లంపల్లిలో 6656 మంది మహిళలకు చీరలు పంపిణీ చేసారు. గతంలో అలియాబాద్ మున్సిపల్ పరిధి మహిళలకు రెండు కోట్ల 33 లక్షల వడ్డీ లేని రుణాలను అందించామని, మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రానున్న మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు తమకు అందిస్తున్న రిజర్వేషన్ కోటాలో పోటీ చేసి రాజకీయ పదవులను కూడా అధిష్టించాలని ఆకాంక్షించారు. అలాగే, మేడ్చెల్ జిల్లాలో రూ. 45 లక్షల నిధులతో 900 మంది మైనారిటీ నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేసామని, మైనార్టీల సంక్షేమం కోసం



ప్రభుత్వం కట్టుబడి ఉందని పేదలు, మైనార్టీలు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం లో 40 కోట్ల నిధులతో మూడు మున్సిపాలిటీలలో ఎల్లంపేట మున్సిపాలిటీలో 9 కోట్ల 43 లక్షల నిధులతో, అలియాబాద్ లో 15 కోట్ల నిధులతో, మూడు చింతలపల్లి లో 15 కోట్ల నిధులతో శంకుస్థాపనలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థ నిర్మించిన మూడు చింతలపల్లి ఎమ్మార్వో ఆఫీస్ కార్యాలయ నూతన భవనాన్ని, మేడ్చల్ మండల తాసిల్దార్ జాయింట్ సబ్ రిజిస్టర్ కార్యాలయాలను కూడా ప్రభుత్వ చీఫ్ విప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో, ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కీసర ఆర్ డి ఓ రాజేష్, డిప్యూటీ కలెక్టర్ మోక్షిత, మూడు చింతలపల్లి ఎం ఆర్ ఓ ఇద్రీస్ మేడ్చల్ ఎం ఆర్ ఓ భూపాల్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కాంతమ్మ, జిల్లా డి ఆర్ డి ఓ సాంబశివరావు, సంబంధిత మున్సిపల్ కమీషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన డాక్టర్ సురంజన్

## ఇంచార్జి ప్రణవ్ నాయకత్వంలో కాంగ్రెస్ మరింత బలపడుతుంది.

## - కాంగ్రెస్ అంటే పేదల పార్టీ,ఇలాంటి పార్టీలో చేరడం అదృష్టంగా భావిస్తున్న.



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జనవరి 19**మున్సిపల్ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరికల జోష్ పెరుగుతుంది. ఓ వైపు అభివృద్ధికి తాము పెద్దపీట వేస్తున్నామని,హుజురాబాద్ జమ్మికుంట మున్సిపాలిటీల అభివృద్ధి కేవలం కాంగ్రెస్ తోనే సాధ్యం అవుతుందని ప్రణవ్ అన్నారు.హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో జమ్మికుంట పట్టణ సీనియర్ డాక్టర్ సురంజన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ప్రణవ్.ఈ చేరికతో జమ్మికుంటలో కాంగ్రెస్ మరింత బలపడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందని ఇంచార్జిగా ప్రణవ్ ప్రజల్లో మమేకమవుతూ పార్టీని ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేస్తున్నారని ఈ సందర్భంగా వారి నాయకత్వంలో పని చేసేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరానని డాక్టర్ సురంజన్ అన్నారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో జమ్మికుంట,హుజూరాబాద్ మున్సిపల్ పీఠాలపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని అన్నారు.

# మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలి.

## ప్రజా సంక్షేమానికి పలు పథకాల అమలు.

## వేములవాడ పట్టణంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ.

## ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది, ఇన్చార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్.

**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** సోమవారం రోజున వేములవాడ పట్టణంలోని 392 ఎస్ హెచ్ జి లకు వడ్డీ లేని రుణాల చెక్కులను వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందిరా మహిళా శక్తి కింద వేములవాడ పట్టణంలోని 392 ఎస్ హెచ్ జి లకు దాదాపు ఒక కోటి 46 లక్షల 19 వేల 636 రూపాయల చెక్కులను, ఇందిరమ్మ చీరలను వేములవాడ పట్టణంలోని ఫంక్షన్ హాల్ లో కలెక్టర్ తో కలిసి పంపిణీ చేయడం జరిగింది. వేములవాడ పట్టణంలో మొత్తం 871 మహిళా సంఘాలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని, కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని, మహిళలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి సంవత్సరంలో సుమారు 20వేల కోట్ల రూపాయలు మహిళల కోసం వెచ్చించారని, ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సాధికారిత కోసం కృషి



చేస్తున్నారని, గ్రామాలలో మహిళల పేరు మీద ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని, ఇందిరాగాంధీ గరిబి హటావో నినాదంతో పేద ప్రజలకు అండగా ఉన్నారని, గతంలో ఇచ్చిన బతుకమ్మ చీరల కాకుండా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణంలోని మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆడ్తి దారుల సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఎర్రబెల్లి రాజేశ్వరరావు



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి జనవరి 19** జమ్మికుంట ఆడ్తి దారుల భవనంలో అర్థిదారులు సమావేశమై నూతన కార్యవర్గని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా పాకాల రవీందర్ రెడ్డి, అధ్యక్షునిగా ఎర్రబెల్లి రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మర్రి రామ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా గుత్తి కుమార్, కోశాధికారిక రావికంటి సత్యనారాయణ, ముఖ్య సలహాదారునిగా కందాల తిరుపతి ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి ఆడ్తి దారుల సంక్షేమానికి కృషి చేస్తున్నానని. అదేవిధంగా ఎల్లవేళలా వారి అందుబాటులో ఉంటూ వారి యొక్క క్షేమాలు చూసుకుంటానని అన్నారు. తనపై నమ్మకంతో నాలుగవసారి అధ్యక్షునిగా అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మాజీ సర్పంచ్ పొన్నగంటి మల్లయ్య, వొళ్ళల బాపుశట్టి, మామిడాల మనోహర్, పోల్సాని సంపత్ రావు, జనార్దన్ రెడ్డి, రాకం రమేష్, కదారి రవి, ఎగితా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# భీమన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** ప్రముఖ శైవ క్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రోజున సమ్మ క్కసారాలమ్మ జాతర ప్రారంభం కావడంతో భక్తులు పోటెత్తినారు. రాష్ట్రం నలుమూలల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయినాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య, 72,700 గా నమోదయింది. అదే సమయంలో స్వామి వారికి భక్తులు సమర్పించిన కోడె మొక్కుల సంఖ్య 8,432 గా ఉంది. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఆలయ ఈవో రమాదేవి స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీడ, టెంట్లు, చలువ పందిళ్ళు, త్రాగునీటి సౌకర్యం, వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక డ్యూటీలను ఆలయ సిబ్బందికి కేటాయించారు. అధిక సంఖ్యలో కోడె మొక్కులు చెల్లించడానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా, కోడెకట్టే ప్రదేశంలో స్వయంగా ఈవో ఉండి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది, సేవాసమితి సభ్యులు పాల్గొని భక్తులకు సేవలు అందించారు.



# రాజన్న ఆలయంలో మహా మంటపం పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.







**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి పనుల లో భాగంగా ఆలయంలో నిర్మాణంలో ఉన్న మహా మంటపం రాఫ్టింగ్ ఫౌండేషన్ పనులను వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం రోజున పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల నాణ్యత, పురోగతిపై అధికారులతో ఆయన చర్చించారు. నిర్దేశిత గడువులోపు పనులు వేగవతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు దారి చేశారు. ఆలయ అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా సోమవారం సమ్మ క్కసారాలమ్మ గద్దెల పునర్వాణం చేసి ప్రారంభించిన సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విప్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో తప్పిపోయిన ఐదేళ్ల బాలుడు.

## సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి దర్శనానికి వచ్చిన ఐదు సంవత్సరాల చిన్న బాబు భక్తుల రద్దీ మధ్య సోమవారం రోజున తప్పిపోయాడు. బాలుడు ని గమనించిన భక్తులు వెంటనే ఆలయ అధికారులకు సమాచారం అందించి, రాజన్న ఆలయ ఈవో రమాదేవి కి అప్పగించారు. సుమారు రెండు గంటల పాటు బాలుడిని రాజన్న ఆలయ ఈవో రమాదేవి పర్యవేక్షణలో ఉంచి, బాలుని పూర్తి వివరాలు సేకరించారు. అనంతరం పోలీసుల సహకారంతో బాలుడి తండ్రిని గుర్తించి సురక్షితంగా బాబును కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. తప్పిపోయిన బాలుడు వివరాలు పేరు, భాను, వయసు ఐదు సంవత్సరాలు, చదువు ఎల్ కేజీ. తండ్రి పేరు మొగులగొని అనిల్, స్వగ్రామం బుస్సాపూర్, ములుగు జిల్లా. తమ కుమారుడిని సురక్షితంగా అప్పగించినందుకు బాలుడి తల్లిదండ్రులు రాజన్న ఆలయ ఈవో రమాదేవికి, ఆలయ సిబ్బందికి, పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో చిన్న పిల్లలను ఎప్పుడూ జాగ్రత్తగా చూసుకోవాలని, పిల్లల చేతిలో తల్లిదండ్రుల ఫోన్ నెంబర్ ఉన్న కాగితం లేదా ఐడి ఉండేలా చూసుకోవాలని ఆలయ అధికారులు సూచించారు.



Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449 Email;prajaabalamnews@gmail.com